నేడు TELUGU DAILY

విలేకరులు కావలెను

అనతికాలంలోనే పత్రికారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందిన నేడు తెలుగు దినపత్రికలో పనిచేయుటకు రిపోర్టర్లు కావలెను. తెలంగాణలోని 33 జిల్లాల్లో పని చేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు. nedudailynews@gmail.comకు బయోడెటా పంపగలరు.

NEWS

9346984911
9133445456



సంచలన వార్తలకు

# నేడు

TELUGU DAILY

శుక్రవారం | 06.02.2026 | సంపుటి : 3 | సంచిక :286 | పేజీలు : 8 | వెల : 2/- | www.nedudailynews.com






నష్టాల్లో ముగిసిన సూచీలు 08

## వికసిత్ భారత్ లక్ష్యం దిశగా

# దేశం పరుగులు

### రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్

- ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు.. ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ
- విపక్షాల నిరసనలు.. నినాదాలు.. చివరకు వాకౌట్



**వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్య్రం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు.**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 : కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి

-మిగతా 2 లో..



### ఎన్నికలకు ముందు 'ఉచిత' హామీలపై పిల్

విచారణకు సుప్రీం అంగీకారం



## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

హనుమకొండ, ఫిబ్రవరి 5 : ఇటీవల ముగిసిన మేడారం మహా జాతర హుండీల లెక్కింపు పక్రియ కొనసాగుతోంది. గురువారం హనుమకొండలోని తితిదే కల్యాణ మండపంలో మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి ఈ లెక్కింపును ప్రారంభించారు. ఈసారి మేడారంలో 788 హుండీలను అధికారులు ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి తమ కానుకలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. హుండీల లెక్కింపునకు 10 రోజుల సమయం పట్టే అవకాశముంది. గతసారి రూ.13కోట్ల ఆదాయం వచ్చినట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు.




## ప్రజాపాలన అందిస్తుంటే

# విషం చిమ్ముతున్నారు

### ఓ కుటుంబం మొత్తం ప్రభుత్వం పడిపోవాలని చూస్తోంది

- అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశాం
- ఇచ్చిన హామీ మేరకు తెలంగాణ ఇచ్చిన ఘనత సోనియమ్మది
- పదేళ్లలో బిఆర్ఎస్ పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదు
- బిజెపి అధ్యక్షుడు పాలమూరుకు వచ్చి హామీలపై మాట్లాడలేదు
- బిజెపికి ఈ ఎన్నికల్లో ఒక్కసీటు కూడా రాకుండా చేస్తాం
- కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో సిఎం రేవంత్
- పార్టీ అభ్యర్థులు క్షేత్రస్థాయిలో కలసి పనిచేయాలని హితవు

**ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే కొందరు విషం చిమ్ముతున్నారని సిఎం రేవంత్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని కుటుంబం మొత్తం దాడికి దిగుతోందని పరోక్షంగా కెసిఆర్ కుటుంబంపై ఆరోపణలు చేశారు. తెలంగాణలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ.17,442 కోట్లు ఖర్చు చేశామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పర్యటించిన సీఎం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గుమ్లాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు.**

కరీంనగర్, ఫిబ్రవరి 5 : తెలంగాణ ఏర్పాటు చేస్తామని సోనియాగాంధీ కరీంనగర్ గడ్డపై నుంచి మాట ఇచ్చారు. ఏపీలో పార్టీ అధికారం కోల్పోయినా మాట తప్పకుండా తెలంగాణ ఇచ్చారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినా.. బీఆర్ఎస్‌కు ప్రజలు

-మిగతా 2 లో..

## తులం బంగారం వచ్చినోళ్లు

# కాంగ్రెస్‌కు ఓటేయండి

### పదేళ్ల బిఆర్ఎస్ అభివృద్ధి.. రెండేళ్ల కాంగ్రెస్ దోఖా పనులు

**సిరిసిల్ల ప్రచారంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రధాన పార్టీలకు చెందిన కీలక నేతలు ప్రచారంలో ఫుల్ బిజీగా ఉన్నారు. గురువారం సిరిసిల్ల పట్టణం బివైనగర్ లో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత కేటీఆర్ పాల్గొన్నారు. కాంగ్రెస్‌కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారని ఆయన విమర్శించారు. 'ఓవైపు అభివృద్ధి చేసిన బీఆర్ఎస్, మరోవైపు ఇచ్చిన హామీలు మరచిన కాంగ్రెస్, ఎప్పుడో ఒకసారి దేవుని పేరు చెప్పకుని వచ్చే బీజేపీ పార్టీలు ఉన్నాయి. ఎవరికి ఓటు వేయ్యాలో మీరే నిర్ణయించుకోవాలి' అని కేటీఆర్ అన్నారు.

02




## గ్రూప్–1 ఉద్యోగులకు

# ఊరట

### సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

హైదరాబాద్, ఫిబ్రవరి 5 : గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై

-మిగతా 2 లో..

## పన్నెండేళ్లుగా తెలంగాణాలో

# బానిస ప్రభుత్వాలు

- పదేళ్ల బిఆర్ఎస్, రెండేళ్ల కాంగ్రెస్‌తో ఒరింగింది శూన్యం
- మజ్లిస్ కనుసన్నల్లోనే రెండు ప్రభుత్వాల పాలన
- మద్యం ఆదాయం.. భూముల అమ్మకం ఇదే పాలసీనా
- రేవంత్ సర్కార్‌పై ఘాటు విమర్శలు చేసిన కిషన్ రెడ్డి



**తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని ప్రజలకు కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి సూచించారు. పన్నెండు ఏళ్లుగా తెలంగాణలో బానిస ప్రభుత్వాలు నడుపుతున్నారని విమర్శించారు. మజ్లిస్ కనుసన్నల్లో బీఆర్ఎస్ పదేళ్లు బానిస పాలన చేస్తే.. కాంగ్రెస్ పార్టీ సైతం మజ్లిస్ ఓట్ల కోసం బానిస పాలన చేస్తుందంటూ మండిపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రభుత్వ భూములను విక్రయించడం అభివృద్ధా? అంటూ ఈ రెండు పార్టీల నేతలను సూటిగా ప్రశ్నించారు.**

హైదరాబాద్, ఫిబ్రవరి 5 : మద్యం, డ్రగ్స్‌తో కుటుంబాలు పతనం అవుతున్నా.. ఈ ప్రభుత్వానికి కావాల్సింది మాత్రం ఆర్థిక వనరులేనని కేంద్ర మంత్రి అన్నారు. భూములు అమ్మాలి.. అప్పులు చేయాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ ఆలోచన అంటూ ఆగ్రహం

-మిగతా 2 లో..



| నేటి చికెన్ ధరలు | |
|---|---|
| ఫారం ధర లైవ్ బర్డ్ | 130 (కిలో) |
| రిటైల్ లైవ్ బర్డ్ | 157 (కిలో) |
| డ్రెస్డ్ స్కిన్‌తో | 228 (కిలో) |
| స్కిన్ లెస్ | 259 (కిలో) |

12 గుడ్ల రిటైల్ ధర ₹72

## బీజాపూర్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో

# మావోయిస్ట్ మృతి



రాయపూర్, ఫిబ్రవరి 5 : ఛత్తీస్‌ఘడ్ బీజాపూర్ జిల్లా తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్లటూన్–30 కమాండర్ ఉదమ్ సింగ్ మృతి చెందినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ తెలిపారు. బీజాపూర్ జిల్లాలో గురువారం ఉదయం నుంచి భద్రత

-మిగతా 2 లో..జ



## అందుబాటులోకి

# భారత్ ట్యాక్సీ

### యాప్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 : ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి

-మిగతా 2 లో..

## మరో రెండేళ్లలో

# కేసీఆరే సీఎం

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు
- గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో హరీశ్ రావు
- మనల్ని బాగా చూసుకునే వారికి ఓటు వేయాలని పిలుపు



గజ్వేల్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్

-మిగతా 2 లో..




## అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

మొదటి పేజీ తరువాయి

తెచ్చారు. తొలుత దిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందించినట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

# వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు

మొదటి పేజీ తరువాయి

రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంక కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో



ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోం దన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నత పదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు. తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్‌ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందారు. 2014 తర్వాత ఎ÷-లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

## ప్రజాపాలన అందిస్తుంటే విషం చిమ్ముతున్నారు

మొదటి పేజీ తరువాయి

పట్టం కట్టారు. ప్రజా తీర్పును కాంగ్రెస్ పార్టీ శిరసావహించింది. పదేళ్లలో పన్నుల రూపంలో రూ.20లక్షల కోట్లు ప్రజలు ప్రభుత్వానికి కట్టారు. కానీ, పదేళ్లలో పేదలకు రెండు పడక గదుల ఇళ్లు కూడా కట్టించలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మున్సిపల్ ఎన్నికలు వచ్చాయి. పాలమూరు జిల్లాలో మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి భాజపా జాతీయ అధ్యక్షుడిని తీసుకొచ్చారు. కాళేశ్వరం, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయ హోదా ఇవ్వలేదు, మెట్రో రైలు మంజూరు చేయలేదు..మూసీకి నిధులు ఇవ్వలేదు. రీజినల్ రింగ్‌రోడ్డు పూర్తి చేస్తామని చెప్పలేదు. ఇవేమీ ఇవ్వకుండా భాజపా జాతీయ అధ్యక్షుడిని ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించారు. దేశంలోని భాజపా అగ్రనేతలందరినీ ఎన్నికల ప్రచారానికి తీసుకొచ్చినా ఒక్క మున్సిపాలిటీ అయినా గెలుస్తారా? కాంగ్రెస్ సత్తా ఏంటో భాజపాకు చూపిస్తాం అని రేవంత్ అన్నారు. భాజపా, బీఆర్ఎస్ బంధం ఫెవికాల్ బంధం కాదా?. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసింది. ఓట్లు, సీట్లు దానం చేసి 8 చోట్ల భాజపా ఎంపీలను గెలిపించారు. 8 చోట్ల డిపాజిట్లు కోల్పోయినా తామే గెలుస్తామని బీఆర్ఎస్ రంకెలేస్తోంది. బీఆర్ఎస్ రూ.లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం..మూడేళ్లలోనూ కూలేశ్వరం అయింది. కాళేశ్వరాన్ని బీఆర్ఎస్ ఏటీఎంలా వాడుకుందని మోదీ, అమిత్ షా స్వయంగా చెప్పారు. కానీ, కాళేశ్వరంపై సీబీఐ విచారణ జరిపించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి పంపిస్తే..




ఇప్పటి వరకు కేంద్రం స్పందించలేదు. దీనిపై కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డి సమాధానం చెప్పాలని సీఎం డిమాండ్ చేశారు. రాజకీయాల్లో డబ్బులతో కాదు.. నమ్మకంతోనే గెలుస్తామని మున్సిపల్ ఎన్నికల బరిలో దిగిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. 'ప్రజలకు నమ్మకం కలిగించండి.. అదొక్కటే మిమ్మల్ని గెలిపిస్తుంది' అని వారికి స్పష్టం చేశారు. గురువారం నాడు కరీంనగర్‌లో మున్సిపల్ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారితో ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడుతూ.. ఇవి కార్యకర్తల ఎన్నికలని తెలిపారు. కార్యకర్తలకు సముచిత స్థానం ఇచ్చినప్పుడే పార్టీ బలపడుతుందని పేర్కొన్నారు. ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని నేతలకు ఆయన సూచించారు. అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్లల్లో ఎన్నో సంక్షేమ పథకాలను అందించామని.. ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు రేవంత్ రెడ్డి. అయితే అధికార పార్టీలో టికెట్ ఆశించే వాళ్లు ఎక్కువగా ఉండటం సహజమని.. ఎంతో మంది పోటీ పడ్డా.. కాంగ్రెస్ పార్టీ బీఫామ్ దక్కడం మీ అదృష్టమని అభ్యర్థులకు సోదాహరణగా వివరించారు. ఒక్క ఓటు.. గెలుపు ఓటములను నిర్ణయిస్తుందని సీఎం రేవంత్ పేర్కొన్నారు. టికెట్ రాని వారిని కూడా సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలంటూ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులకు దిశానిర్దేశం చేశారు ముఖ్యమంత్రి. పదేళ్ల పాలనలో గత ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకపోయినా మన ప్రభుత్వంలో అర్హులందరికీ రేషన్ కార్డులు అందించామని చెప్పుకొచ్చారు. పేదలకు సన్న బియ్యం.. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. మహిళా గ్రూపులకు సున్నా వడ్డీ రుణాలు అందించామని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు అందించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాలతోపాటు వాటి వల్ల చేకూరిన లబ్దిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని మున్సిపల్ అభ్యర్థులకు స్పష్టం చేశారు. మనం అబద్దాలు చెప్పాల్సిన పనిలేదని.. ప్రభుత్వం చేసిందే ప్రజలకు చెప్పండంటూ వారికి సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. సభలో మంత్రులు శ్రీధర్‌బాబు, అడ్లూరి లక్ష్మణ్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## తులం బంగారం వచ్చినోళ్లు కాంగ్రెస్‌కు ఓటేయండి

మొదటి పేజీ తరువాయి

రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 5 :ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పోటీ గత పదేళ్లలో ప్రజల కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన బీఆర్ఎస్ పార్టీకి, గడిచిన రెండేళ్లలో ఉన్న సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కాంగ్రెస్ పార్టీకి మధ్య ఉన్నదని కేటీఆర్ చెప్పారు. మరోసారి కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తేనే తగిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు తిరిగి ప్రారంభమవుతాయని, ఆ దిశగా ఈ మున్సిపల్ ఎన్నికలతోనే కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేసుకునే కార్యక్రమం ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ పార్టీని గనుక ఈ మున్సిపల్ ఎన్నికల్లో నిలదీయకుంటే, ఇచ్చిన హామీల మోసంపైన ప్రశ్నించకుంటే, మరో మూడు సంవత్సరాల దాకా అంటే శాసనసభ ఎన్నికల వరకు ప్రజలకి ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించే అధికారం, అవకాశం రాదని చెప్పారు. ఇప్పుడు గనుక ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేసేలా సురుకు పెట్టకుంటే కాంగ్రెస్ పార్టీ తన మోసాలను కొనసాగిస్తుందని అన్నారు. కాంగ్రెస్ వాళు తులం బంగారం ఇస్తానన్నారు. కానీ, వాళ్లు ఉన్న పుస్తెలు ఎత్తుకు పోయే రకం. నాపై కోపంతో బతుకమ్మ చీరలు బంద్ చేశారు. నేతన్నల బతుకుదెరువుపై దెబ్బ కొట్టారు. దేవుని గుడి వద్ద ఉండి అడుక్కుతినేవారిలాగా, దేవుని పేరుతో ఓట్లడుక్కోవడానికి మాత్రమే బీజేపీ వారే వస్తారు. అలానే కాంగ్రెస్ కు ఓటేస్తే సిరిసిల్ల జిల్లాను తీసేస్తారు. తులం బంగారం వచ్చిన వారు కాంగ్రెస్ కు ఓటెయ్యండి, రానివారు బీఆర్ఎస్‌కు ఓటెయ్యండి. సిరిసిల్ల బతుకుదెరువు లేకుండా చేసినోడికి, గట్టి బుద్ధి చెప్పాలి' అని కేటీఆర్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక వార్డుల ప్రజలను, పట్టణ ప్రజలను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ఇప్పటికే అబద్దాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ.. మున్సిపల్ ఎన్నికల కోసం మరోసారి అబద్దాలు చెబుతోందని విమర్శించారు. కాంగ్రెస్ మాటలు నమ్మి ఓటు వేస్తే మరోసారి మోసపోయినట్లు అవుతుందని చెప్పారు. కేటీఆర్ ఇంకా ఏమన్నారో ఆయన మాటల్లోనే.. 'మున్సిపల్ ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తానని చెబుతున్నారు. కానీ ఇప్పటికీ ఎన్ని పంట కాలాలు గడిచాయి..? ఎన్నిసార్లు రైతుబంధు వేసిండో చెప్పాలి. రైతుబంధు రైతన్నల ఖాతాలో వేయడానికి ముఖ్యమంత్రికి మున్సిపల్ ఎన్నికలు ఏ విధంగా అడ్డు వస్తున్నాయి? కేవలం



ఎన్నికలు అయిపోయేంత వరకు ఆశ చూపించి, మరొకసారి మోసం చేయడానికే రేవంత్ రెడ్డి ఈ మాట చెబుతున్నారు. అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ వంటి కార్యక్రమాలను కూడా పక్కన పెట్టారు. ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అందరినీ మోసం చేస్తున్నది. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మళ్లీ కాంగ్రెస్ పార్టీ మాటలు నమ్మి ఓటువేస్తే.. మళ్లీ మోసపోవడం ఖాయం' అని కేటీఆర్ అన్నారు. 'ముఖ్యమంత్రికి చేతిలో అధికారం, అవకాశం ఉన్నప్పుడు మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏమున్నది? చేతనైతే ప్రజలకు మంచి చేయాలి, ఇచ్చిన హామీలు అమలు చేయాలి. కానీ కేసీఆర్‌ను తిట్టవలసిన అవసరం ఏముంది..? ప్రతి అంశంలో అడ్డగోలుగా మాట్లాడటం, అబద్దాలు ఆడటం తప్పించి, ఈ రెండేళ్ళలో ఒక్కటంటే ఒక్క మంచి పని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేదు. కేసీఆర్ ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలను తీసివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది. ఈ ఎన్నికల్లో జిల్లా కేంద్రాలను రద్దు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ మాటలు చూసి ఓటు వేయాలి. జిల్లాలు ఎత్తివేస్తామని చెప్పిన తర్వాత కూడా కాంగ్రెస్ పార్టీకి ఓటువేస్తే అది మంచా, చెడా అన్న విషయాన్ని గుర్తించి ఓటు వేయాలని కేటీఆర్ సూచించారు.

## పన్నెండేళ్లుగా తెలంగాణాలో బానిస ప్రభుత్వాలు

మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. గత బీఆర్ఎస్.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ప్రజా ప్రభుత్వం కాదు.. అవినీతి, దోపిడి ప్రభుత్వమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభివర్ణించారు. వీధి దీపాలు వెలిగించేందుకు డబ్బులు లేని దౌర్భాగ్య పరిస్థితిలో ఈ రాష్ట్ర ప్రభుత్వం ఉందని వ్యంగ్యంగా అన్నారు. పని చేసే పార్టీలకే ఓటు వేయాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగస్తులకు ఐదు డీఏలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయంటూ కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. ఇదా ప్రజా ప్రభుత్వమా.. పని చేసే ప్రభుత్వమా? సమాధానం చెప్పాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి సవాల్ విసిరారు. పని చేసే ఏకైక పార్టీ బీజేపీ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. పొరుగునున్న ఆంధ్రప్రదేశ్‌లో అనేక విమానాశ్రయాలు ఉన్నాయని.. తెలంగాణలో ఎందుకు లేవని ఆయన రేవంత్ ప్రభుత్వాన్ని నిలదీశారు. గత పదేళ్లు ఏమీ చేశారంటూ బీఆర్ఎస్ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు.



తెలంగాణ రాష్ట్రం.. కాంగ్రెస్ పార్టీకి బంగారు బాతు అయిందన్నారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా.. ఇక్కడి నుంచే నగదు పంపుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఉద్యోగుల బెనిఫిట్స్ మాత్రం ఇవ్వరన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ఓటు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఆర్ఆర్ ట్యాక్స్‌తో వ్యాపారస్తులు భయపడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మున్సిపాలిటీలకు ఎంత నగదు ఇచ్చారో సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలని బల్లగుద్దీ మరి ప్రశ్నించారు. ఫిక్స్‌డ్ రేట్స్.. వన్ టైమ్ పేమెంట్‌ను ఈ కాంగ్రెస్ ప్రభుత్వం పక్కగా కొనసాగిస్తుందని విమర్శించారు. గత 26 నెలల్లో ఏమీ చేసిందో చెప్పాలంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆయన సూటిగా ప్రశ్నించారు. గత ప్రభుత్వంలో పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇంటి అల్లుడి ఫోన్ ట్యాపింగ్ చేసిన దౌర్భాగ్య పరిస్థితి నెలకొందన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ఏమీ పీకారని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత బాషలో అడుగుతున్నా నన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున గెలిచిన జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి గుర్తు చేశారు.

## మరో రెండేళ్లలో కేసీఆరే సీఎం

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు. కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## బీజాపూర్ జిల్లా ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ మృతి

మొదటి పేజీ తరువాయి

బలగాలు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు కొనసాగుతున్నాయి. డీఆర్‌జీ (డిస్టిక్ రిజర్వ్ గార్డు) సీఆర్పీఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. పెద్దగెల్లూరు అడవిలో మావోయిస్టులు ఉన్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో బలగాలు ఆ ప్రాంతంలో ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరు వర్గాలకు మధ్య కాల్పులు జరిగాయి. అయితే ఘటనాస్థలి నుంచి ఆటోమేటిక్ ఏకే-47 రైఫిల్‌తో పాటు పలు ఆయుధసామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.



# కరీంనగర్‌కు రింగ్ రోడ్డు నిర్మిస్తాం

- కరీంనగర్, వరంగల్‌లను జంట నగరాలుగా తీర్చిదిద్దుతాం
- గోదావరి పుష్కరాల్లో బాసర నుంచి భద్రాద్రి వరకు అభివృద్ధి
- రామడుగులోఅడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటు
- కరీంనగర్ పర్యటనలో పలు అభివృద్ధి పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన



**కరీంనగర్, ఫిబ్రవరి 5 :** కరీంనగర్ జిల్లా చొప్పదండిలో పలు అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసారు. 2027 లో గోదావరి పుష్కరాలు రాబోతున్నాయి. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పరివాహక ఆలయాలను అభివృద్ధి చేస్తాం అని సిఎం అన్నారు. ఎకో టూరిజంను అభివృద్ధి చేసి పర్యాటక క్షేత్రంగా తీర్చి దిద్దుతాం అన్నారు. మేడారం సమ్మక్క- సారలమ్మ దర్శనానికి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రాలేదని అంటూ.. పేదోళ్ల దేవుళ్లను మొక్కేందుకు వాళ్లకు నామోషీ.. తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం అన్నారు. కరీంనగర్ కు ఔటర్ రింగ్ రోడ్డు నిర్మిస్తాం. వరంగల్, కరీంనగర్ జంట నగరాలుగా అభివృద్ధి చేసి రెండింటి మధ్యలో డంప్ యార్డు ఏర్పాటు చేసి విద్యుత్ ఉత్పత్తి చేస్తాం అని అన్నారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. రూ.45.15 కోట్లతో కరీంనగర్ జిల్లా రామడుగులోఅడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. రు. 5 కోట్లతో కరీంనగర్ జిల్లా గంగాధర మండలం మధురానగర్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. చొప్పదండి మండలం గుమ్లాపూర్ లో ఏర్పాటు చేసిన 'ప్రజా పాలన- ప్రగతి బాట' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు చేస్తామని కరీంనగర్ గడ్డపై నుంచి సోనియా గాంధీ మాట ఇచ్చారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సర్వం కోల్పోయినా.. ఇచ్చిన మాట ప్రకారం సోనియా గాంధీ తెలంగాణ ఏర్పాటు చేశారని అన్నారు. పదేళ్లు అంది వచ్చిన అధికారాన్ని అవకాశాన్ని ఉపయోగించుకుని బీఆరెస్ నాయకులు వేల కోట్లు సంపాదించుకున్నారు తప్ప ప్రజలకు చేసిందేం లేదు. పదేళ్ల తర్వాత ప్రజా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుంటే ఇప్పుడు వాళ్లు విషం చిమ్ముతున్నారు. పదేళ్లలో కనీసం పేదలకు డబుల్ బెడ్రూంలు కూడా ఇవ్వలేదు. ప్రజా ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చుకుం టున్నాం రైతులకు ఉచిత కరెంట్ కాంగ్రెస్ పార్టీ పేటెంట్.. అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా రూ. 10 లక్షల వరకు పేదలకు ఉచిత వైద్యం అందిస్తున్నాం. సన్నబియ్యం, ఆర్టీసీలో మహిళలకు ఉచితసౌకర్యం అందించాం అన్నారు. పదేళ్లలో బీఆరెస్ ఏం చేసింది, పన్నెండేళ్లల్లోమోదీ ఏం చేశారో చర్చిద్దాం రండి? రెండేళ్లలో మేం ఏం చేశామో చెబితే మీ గుండెలు పగులుతాయ్ అని సిఎం అన్నారు. నిరుద్యోగులకు 70 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం అన్నారు. వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తు న్నాం. హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్, డైట్ చార్జీలు పెంచాం. చొప్పదండిలో డిగ్రీ కాలేజీ నిర్మిస్తున్నాం. రైతులకు 25 లక్షల 35 వేల మంది రైతులకు రూ.2 లక్షలు రుణమాఫీ చేశాం 9 రోజుల్లో 9 వేల కోట్లు రైతు భరోసా అందించాం. కేవలం రైతుల కోసమే రెండేళ్లలో లక్ష కోట్లు ఖర్చు చేశాం. సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ అందించాం. వరి వేస్తే ఉరి అనిమీరంటే.. రైతులు పండించిన ప్రతీ గింజ మా ప్రభుత్వం కొంటుంది. వ్యవసాయం పం డుగ చేసి చూపిస్తున్నాం.. ఆడబిడ్డలు కట్టుకునే చీరల్లో కూడా గత ప్రభుత్వంలో కమిషన్లు తీసుకున్నారని మండిపడ్డారు. మా ప్రభుత్వం ఆడబిడ్డలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ సౌకర్యం కోసం రెండేళ్లల్లో రూ. 9 వేల కోట్లు ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.27 కోట్లు మహిళలకు రుణాలు అందించి వ్యాపారంలో ప్రోత్సహిస్తున్నాం ఆడబిడ్డలను ఆర్టీసీ బస్సులకు యజమానులను చేశాం. రాష్ట్రాన్ని దోచుకుని అప్పులపాలు చేసి పోయి కెసీఆర్ ఫామ్ హౌస్ లో పడుకున్నాడని ఎద్దేవా చేశారు.

## గ్రూప్-1 తీర్పుతో ఊరట

### అభ్యర్థులకు సీఎం రేవంత్‌రెడ్డి అభినందన



**హైదరాబాద్, ఫిబ్రవరి 5 :** గ్రూప్ -1 నియామకాల అంశంలో హైకోర్టు తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పును హృదయపూర్వకంగా స్వాగతిస్తున్నామన్నారు. ఎందరు, ఎన్ని కుట్రలు పన్ని.. ఉద్యోగ నియామకాలను అడ్డుకోవాలని చూసినా.. వారి కుట్రలు, కుతంత్రాలను ఛేదించి న్యాయ పోరాటంలో విజయం సాధించామని తెలిపారు. న్యాయస్థానం తీర్పు నేపథ్యంలో 563 మంది గ్రూప్ -1 అభ్యర్థులకు అభినందనలు చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత తొలిసారి గ్రూప్ -1 అధికారులుగా మీరు నియమితులయ్యారు. ఇక రాష్ట్ర పునర్ నిర్మాణానికి పునరంకితం కావాలని పిలుపునిస్తున్నానని పేర్కొన్నారు. కాగా.. గ్రూప్ -1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఊరట లభించింది. గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు బెంచ్ కీలక తీర్పు వెల్లడించింది. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేసింది సీజే ధర్మాసనం. గ్రూప్ 1 జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. మెయిన్స్ జవాబు పత్రాలు మళ్ళీ మూల్యాంకనం చేయాలని సింగిల్ జడ్జి ఆదేశాలు ఇచ్చారు. అయితే సింగిల్ జడ్జి ఆదేశాలపై టీజీపీఎస్సీ, ఎంపికైన అభ్యర్థులు అప్పీల్ చేశారు. దీనిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఈమేరకు తీర్పు వెలువరించింది. తుది తీర్పునకు లోబడి నియామకాలు చేపట్టవచ్చని గతంలో ఉత్తర్వులు ఇచ్చింది సీజే బెంచ్.. ఇప్పటికే 562 మందికి తెలంగాణ ప్రభుత్వం నియామక పత్రాలు అందజేసింది. ఈ తీర్పుపై సీఎం రేవంత్‌రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు.



## బిజెపిని గెలిపిస్తే దండిగా నిధులు

### ప్రచారంలో కేంద్ర హెూంశాఖ మంత్రి బండి

**కరీంనగర్, ఫిబ్రవరి 5 :** మున్సిపాలిటీల్లో బిజెపిని గెలిపిస్తే నిధుల వరద పారిస్తానని కేంద్ర హెూంశాఖ మంత్రి బండి సంజయ్ అన్నారు. మున్సిపాలిటీలకు వచ్చేది కేంద్ర నిధులేనని అన్నారు. గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని, మున్సిపల్ ఎన్నికల్లో భాజపాని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. హుజూరాబాద్ సూపర్ బజార్ చౌరస్తాలో గురువారం నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం రూ.వందల కోట్లు తీసుకొచ్చాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని పరికరాలు తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం సరైన సిబ్బందిని నియమించట్లేదు. గత పదేళ్ల నుంచి హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీలు అమలు నెరవేర్చిందా? ఈ ప్రభుత్వం హుజూరాబాద్ మున్సిపల్ అభివృద్ధికి ఒక్కపైసా ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో భాజపాను గెలిపిస్తే ఇక్కడ మినీ స్టేడియం నిర్మిస్తాం. కాంగ్రెస్‌ను గెలిపిస్తే అన్ని ట్యాక్సులు పెంచుతారు. మేం దిల్లీ నుంచి నిధులు తీసుకొచ్చి హుజూరాబాద్‌ను అభివృద్ధి చేయిస్తామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు.



## మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఫ్లాగ్ మార్చ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 :** రానున్న మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఈరోజు జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తుర్కపల్లి గ్రామంలో పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్లు జీనోమ్ వ్యాలీ ఎస్‌హెచ్‌వో గోపగాని గురువయ్య తెలిపారు. జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ సిబ్బంది, జగద్గిరిగుట్ట పోలీస్ సిబ్బంది కలిసి గ్రామంలో ఫుట్ ప్యాట్రోలింగ్ నిర్వహిస్తూ అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచినట్లు తెలిపారు. ప్రజల్లో భద్రతాభావాన్ని పెంపొందించడంతో పాటు విజిబుల్ పోలీసింగ్, శాంతి భద్రతలను కట్టుదిట్టంగా అమలు చేయడానికి మార్చ్ నిర్వహించారు. ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

## పోగొట్టుకున్న బ్యాగ్‌ను మహిళకు అప్పగించిన పోలీసులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 :** కూకట్‌పల్లి ప్రభుత్వ కళాశాలలో ప్రధానోపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్న మహిళ జగద్గిరిగుట్ట పరిధిలోని గాంధీ హైట్స్ వద్ద స్కూటీపై ప్రయాణిస్తున్న సమయంలో ఆమె తన హ్యాండ్ బ్యాగును పోగొట్టుకున్నారు. బ్యాగులో మొబైల్ ఫోన్ ఉండడంతో ఎవరైనా యూపీఐ ద్వారా అకౌంట్‌లోని నగదు విత్ డ్రా చేస్తారేమో అని ఆందోళన చెందారు. ఇదే విషయమై ఆమె జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట క్రైమ్ విభాగం పోలీసులు డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ పి. నరేందర్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తక్కువ సమయంలోనే తన బ్యాగును గుర్తించి, బాధితురాలికి అప్పగించారు. అయితే బ్యాగ్ లోని మొబైల్ ఫోన్ తో సహా.. తన అకౌంట్‌లో నగదుతో పాటు ఇతర విలువైన వస్తువులన్నీ సురక్షితంగా ఉండటంతో ఆమె సంతోషం వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన జగద్గిరిగుట్ట పోలీసులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## మేఘాలయ బొగ్గుగనిలో పేలుడు

### 16మంది కూలీల దుర్మరణం

**షిల్లాంగ్, ఫిబ్రవరి 5 :** మేఘాలయలో బొగ్గుగనిలో గురువారం భారీ ప్రమాదం జరిగింది. అందులో పేలుడు సంభవించడంతో 16 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు వెల్లడించిన కథనాల ప్రకారం.. గనిలో బొగ్గు తవ్వకాలు చేపడుతోన్న సమయంలో ఈ పేలుడు జరిగింది. దాంతో కూలీలు అందులో చిక్కుకుపోయారు. వారిలో ఎక్కువ మంది అస్సాంకు చెందినవారిగా తెలుస్తోంది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అయితే పేలుడుకు గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. మేఘాలయలో ర్యాట్‌హోల్ మైనింగ్, అశాస్త్రీయ పద్ధతుల్లో తవ్వకాలను 2014లోనే జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. సమాంతరంగా సన్నని గుంతలు తవ్వుతూ బొగ్గును బయటకు తీసే పద్ధతినే ర్యాట్ హోల్ మైనింగ్‌గా వ్యవహరిస్తారు. ఇలా నేలలో ఇరుకైన గుంతలను తవ్వడాన్నే ర్యాట్ హోల్‌గా పేర్కొంటారు. సుమారు నాలుగు అడుగుల వెడల్పుతో మాత్రమే ఉంటుంది. కేవలం ఒక్క మనిషి మాత్రమే వెళ్లగలడు. కాగా.. ఎన్‌జీటీ నిషేధాన్ని నిషేధాన్ని సుప్రీంకోర్టు కూడా సమర్థించింది.

## బూతుల ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలుస్తారు

- కేసీఆర్‌ను జాతిపిత అన్నందుకు విషం కక్కుతున్న రేవంత్
- మాజీమంత్రి హరీష్ రావు ఘాటు విమర్శ



**హైదరాబాద్, ఫిబ్రవరి 5 :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వికృత మాటలకు సభ్య సమాజం ఛీ కొడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను జాతిపిత అన్నందుకు రేవంత్ రెడ్డి విషం కక్కుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చూస్తుంటే ఆవేదన కలుగుతోందన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ లక్ష్యంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న వరుస విమర్శలపై మాజీ మంత్రి హరీశ్ రావు గురువారం కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్‌ను జాతిపితగా తెలంగాణ సమాజం పిలుచుకుంటే రేవంత్ రెడ్డికి ఎందుకు కడుపునొప్పి అని ప్రశ్నించారు. బూతుల ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి చరిత్రలో మిగిలిపోతాడన్నారు. పాలన చేతకాక సీఎం రేవంత్ రెడ్డి నిరాశ నిస్పృహలో ఉన్నారని చెప్పారు. నీతి లేకుండా జాతి అని మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ వైఖరిని ఎండగట్టారు. సీఎం రేవంత్ రెడ్డి భాష, అరాచకాలపై స్పందించాలంటూ తెలంగాణ మేధావులకు ఈ సందర్భంగా హరీశ్ రావు పిలుపునిచ్చారు. రేవంత్ రెడ్డి అదుపు తప్పి ఎలా మాట్లాడుతున్నారో గమనించాలంటూ కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు సూచించారు. ఇలాంటి ముఖ్యమంత్రి తెలంగాణకు ఉండటం మన దౌర్భాగ్యమన్నారు. ఏడేళ్లలో ఎస్ఎల్‌బిసి టన్నెల్‌ను 11 కిలో కిలోమీటర్లు బీఆర్ఎస్ ప్రభుత్వంలో తవ్వామని.. ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం వంద మీటర్లు కూడా తవ్వలేదని విమర్శించారు. ఎస్ఎల్‌బిసి టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో శవాలు బయటకు తీసుకురాలేని దద్దమ్మ రేవంత్ రెడ్డి అని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమం గురించి రేవంత్ రెడ్డి మాట్లాడితే అమరవీరుల ఆత్మ ఘోషిస్తుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డి హేట్ స్పీచ్‌పై ఉపన్యాసం ఇచ్చారని.. అదే వేదికపై రేవంత్ రెడ్డి హేట్ స్పీచ్‌కు లైవ్ డెమో ఇచ్చారని తెలిపారు. ప్రతిసారీ డైవర్షన్ చేయాలనుకుంటే ప్రజలే రేవంత్‌ని ముఖ్యమంత్రి పదవి నుంచి డైవర్షన్ చేస్తారని చెప్పారు. ప్రతి నెలకో కుంభకోణానికి పాల్పడ్డారంటూ కాంగ్రెస్ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు హరీష్ రావు. గ్యారెంటీలు నిల్.. స్కామ్‌లు ఫుల్ అంటూ రేవంత్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తన కుర్చీని కాపాడుకోవటానికి బీజేపీతో రేవంత్ రెడ్డి చీకటి ఒప్పందం చేసుకున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్ ఎంపీ సీటును బీజేపీకి రేవంత్ రెడ్డి బహుమానంగా ఇచ్చారని చెప్పారు. చాలా రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఖాతా తెరవలేదన్నారు. పగ ప్రతీకారాలు తప్ప పాలన మీద దృష్టి లేదంటూ సీఎం రేవంత్ రెడ్డి అనుసరిస్తున్న వైఖరిపై మండిపడ్డారు. రూ. 25 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఎక్కడ ఇచ్చావో ప్రెస్ క్లబ్‌లో చర్చ పెడదామా? అంటూ సీఎం రేవంత్‌కు హరీశ్ రావు సవాల్ విసిరారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చిన తర్వాత అయినా మారాలంటూ సీఎం రేవంత్ రెడ్డికి ఈ సందర్భంగా హరీశ్ రావు హితవు పలికారు. రేవంత్ రెడ్డి మారతారన్న నమ్మకం తనకు లేదని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## సీనియర్ నటి వాసవి కన్నుమూత



**విజయనగరం, ఫిబ్రవరి 5 :** తెలుగు సీనియర్ నటి వాసవి అలియాస్ పద్మ అనారోగ్యంతో కన్నుమూశారు. గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆమె తన స్వస్థలమైన విజయనగరంలో తుదిశ్వాస విడిచారు. ఈ విషాద వార్తను నటి కరాటే కళ్యాణి సోషల్ మీడియా వేదికగా తెలియజేశారు. ఆమె మరణవార్తతో సినీ వర్గాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి. కరాటే కళ్యాణి తన ఫేస్‌బుక్ పోస్టులో పద్మతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. 'నిన్ను కాపాడాలని ఎంతో ప్రయత్నించాను. కానీ తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయావు. నీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలి. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి' అంటూ ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు అనంతరం పలువురు సినీ ప్రముఖులు, అభిమా నులు వాసవికి సోషల్ మీడియా ద్వారా సంతాపం తెలుపుతున్నారు. 1978లో విజయనగరంలో జన్మించిన వాసవి, జయ వాహిని పేరుతో టెలివిజన్, సినీ రంగాల్లో మంచి గుర్తింపు సంపాదించారు. చిన్న చిన్న పాత్రలతో కెరీర్ ప్రారంభించిన ఆమె అనేక తెలుగు, తమిళ చిత్రాల్లో నటించారు. సినిమాలతో పాటు సీరియల్స్ ద్వారా ప్రేక్షకులకు మరింత దగ్గరయ్యారు. ముఖ్యంగా నెగెటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లో ఆమె నటన ప్రత్యేకంగా గుర్తింపు తెచ్చిపెట్టింది. 2019లో విడుదలైన 'రఘుపతి వెంకయ్య నాయుడు' చిత్రంలో వీకే నరేష్ సరసన నటించిన ఆమె, చివరిసారిగా 'బహిర్భూమి' సినిమాలో కనిపించారు. గత కొన్ని సంవత్సరాలుగా రొమ్ము క్యాన్సర్‌తో బాధపడుతున్న వాసవి ఆరోగ్య కారణాల వల్ల నటనకు దూరమయ్యారు. ఆమె పరిస్థితి విషమించడంతో వైద్యులు ఇంటికి తీసుకెళ్లాలని సూచించగా, కుటుంబ సభ్యులు విజయనగరానికి తరలించారు. అక్కడే ఆమె చివరి శ్వాస విడిచారు. తెరపై అనేక పాత్రలతో అలరించిన ఈ నటి ఇక లేరనే వార్త అభిమానులను తీవ్ర దిగ్భాం÷-రతికి గురిచేస్తోంది. ఆమె మృతికి పలువురు నివాళులు అర్పిస్తున్నారు.

## గాంధీనగర్ విమెన్స్ హాస్టల్‌లో అగ్నిప్రమాదం

- సకాలంలో మంటలు ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- ఉదయం అంతా బయటకు వెళ్లడంతో తప్పిన ప్రాణాపాయం

**హైదరాబాద్, ఫిబ్రవరి 5 :** ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్ లో గల ఓ ఉమెన్స్ హాస్టల్లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనపై స్థానికులు అగ్నిమాపక అధికారులు, పోలీసులకు సమాచారం అందజేశారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అదృష్టవశాత్తూ ప్రమాద సమయంలో ఆ వసతి గృహంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌లోని సుధామ పీజీ అకామడేషన్ ఫర్ ఉమెన్స్ హాస్టల్లో అగ్నిప్రమాదం జరిగింది. హాస్టల్‌లో ఉన్న యువతులంతా.. విధులు, కాలేజీలకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. ఒకవేళ రాత్రి సమయంలో లేదా విద్యార్థులున్న సమయంలో ఈ ఘటన జరిగి ఉంటే పరిస్థితి అత్యంత దారుణంగా ఉండేదని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ అగ్నిప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల సంభవించి ఉండవచ్చని పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది భావిస్తున్నారు. మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్న మూడు ఫైర్ ఇంజిన్లు.. మంటలను అదుపులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాయి. అగ్నిమాపక సిబ్బందితో పాటు హైడ్రా బృందాలు కూడా సహాయక చర్యల్లో పాల్గొని మంటలు పక్క భవనాలకు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకున్నాయి. నగరంలోని పీజీ హాస్టళ్లలో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ఉండటానికి పలు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచనలు చేశారు. పాత పీజీ హాస్టళ్లలో ఎలక్ట్రికల్ వైరింగ్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేయించాలని అన్నారు. ప్రతి అంతస్తులో సేఫ్టీ పరికరాలు అందుబాటులో ఉంచాలని కోరారు. షార్ట్ సర్క్యూట్ జరిగినప్పుడు ఎలా స్పందించాలో హాస్టల్ విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ముషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఆస్తి నష్టం ఎంత జరిగిందనే దానిపై అధికారులు అంచనా వేస్తున్నారు.



## పవన్‌తో పొత్తుతో విషం చిమ్ముతున్న బీజేపీ

- తెలంగాణ వ్యతిరేకి పవన్ కళ్యాణ్
- కాంగ్రెస్‌కు ఓటేస్తేనే అభివృద్ధి సాధ్యం : పొన్నం

**హుస్నాబాద్, ఫిబ్రవరి 5 :** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన అధ్యక్షుడు, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో పొత్తుపెట్టుకుని బీజేపీ తెలంగాణపై విషం చిమ్మడాన్ని ప్రజలెవ్వరూ సహించరని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణను వ్యతిరేకించే విధానాలకు బీజేపీ పాల్పడుతుందని విమర్శించారు. ఒక వైపు తెలంగాణకు నిధులు ఇవ్వకుండా మోసం చేస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలని కోరారు. మరోవైపు తెలంగాణ కండ్లు పడి ఆంధ్రా కొబ్బరి చెట్లు ఎండిపోయాయన్న పవన్ కళ్యాణ్ తెలంగాణలో ప్రచారం చేస్తామంటే ఎవరూ చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. తెలంగాణ ప్రజలను అవమానపరిచే విధంగా, వివక్షపూరితంగా మాట్లాడే వ్యక్తులతో పొత్తులు పెట్టుకుని వస్తున్న బీజేపీ ఆలోచనను తెలంగాణ మేధావులు,ప్రజలు ఆలోచించాలని కోరారు. హుస్నాబాద్‌లో ఆయన ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు. అలాగే గత పదేళ్లలో బిఆర్ఎస్ చేసింది సున్నా అని అన్నారు.

## మేడారంలో అత్యాచార ఘటన అబద్ధం

### తేల్చి చెప్పిన జాతీయ మహిళా కమిషన్

**ములుగు, ఫిబ్రవరి 5 :** మేడారం జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరగలేదని జాతీయ మహిళా కమిషన్ ఎంక్వయిరీ కమిటీ తేల్చి చెప్పింది. గురువారం మధ్యాహ్నం జాతీయ మహిళా కమిషన్ సభ్యులు డెలినా, కంచన్ కట్టర్ ఆధ్వర్యంలో విచారణ కమిటీ ములుగుకు చేరుకుంది. అనంతరం స్థానిక కలెక్టరేట్ లో కలెక్టర్ దివాకరం, ఎస్పీ రామ్‌నాథ్ కేకన్‌తో కమిటీ సమావేశమైంది. ఆ తర్వాత గ్యాంగ్ రేప్‌పై విచారణ చేపట్టింది. అలాగే ఈ ఘటన జరిగిందంటూ ఆరోపిస్తున్న ప్రదేశాన్ని సైతం కమిటీ సభ్యులతోపాటు జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. ఈ జాతరలో ఎలాంటి గ్యాంగ్ రేప్ ఘటన జరగలేదని సదరు కమిటీ ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చింది. దాంతో పోలీసుల నుంచి లిఖిత పూర్వక నివేదిక వచ్చాక.. జాతీయ మహిళా కమిషన్‌కు ఈ ఎంక్వయిరీ కమిటీ.. రిపోర్టును అందించనుంది. మేడారంలో జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు సమ్మక్క-సారలమ్మ జాతర జరిగింది. ఈ జాతరలో బాలికపై సామూహిక అత్యాచారం జరిగిందంటూ సోషల్ మీడియాలో వార్త వైరల్ అయింది.

# మోహన్ బాబు వర్సిటీలో సినిమా తరహా శిక్షలా?



**నటుడు మోహన్ బాబు విద్యాసేవ ఎలాంటిదో బట్టబయలు అయ్యింది. పైకి నీతి సూత్రాలు వల్లిస్తూ.. జలగల్లా పీక్కుతుంటున్న తీరు వెలుగుచూసింది. తను పేదలకు ఉచితగా విద్యను అందిస్తున్నానని చెబుతున్న బాంబికపు మాటలు ఉత్తవే అని తేలింది. ఇదంతా ఒక ఎత్తయితే ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్య మరింత కలకలం రేపుతోంది. ఇక్కడి అవినీతిపై ప్రశ్నించిన విద్యార్థులను కిడ్నాప్ చేయించడం చూస్తే మోహన్‌బాబు ఆయన తనయుడు ఎంతకు తెగించారో అర్థం చేసుకోవచ్చు.**

నిజానికి కార్పోరేట్ కళాశాలల అవినీతి కథలు అనకొండలా బుసలు కొడుతున్నాయి. అనుమానాస్పద మరణాలు, ఆత్మహత్యలపై ప్రభుత్వాలు కిమ్మనడం లేదు. నయా ఆర్థిక విధానాల పుణ్యమా అని కార్పొరేట్ల చేతుల్లో చిక్కుకున్న విద్యావ్యవస్థకు ఇప్పటికే లాభార్జన ప్రధానంగా మారింది. అక్కడి నుండి తమ ఖజానాలు నింపుకోవడానికి, ఎంతటి దారుణమైనా చేసే మాఫియా ముఠాల స్థాయికి కార్పొరేట్ విద్యా వ్యవస్థ దిగజారుతున్న తీరుకు తాజా పరిణామం ఒక నిదర్శనం. ఇది ఒక్క మోహన్ బాబుకే పరిమితం కాదు. ఇప్పుడు మోహన్‌బాబు వ్యవహారం బయపడింది. గతంలో నారాయణ, శ్రీచైతన్య స్కూళ్లు, కాలేజీల్లో వందలమంది పిల్లలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అనుమానాస్పద మృతి చెందారు. ఇవన్నీ బయటకు రాకపోవడానికి ఘనత వహించిన పాలకుల తీరే కారణం. ఇక మోహన్ బాబు విద్యాసంస్థల వ్యవహారానికి వస్తే..ఫీజుల దందాపై గళమిప్పిన ఎస్‌ఎఫ్‌ఐ నేతలను కిడ్నాప్ చేయడానికి తిరుపతిలోని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం బరితెగించిన తీరు దిగ్భ్రాంతిని కలిగిస్తోంది. బౌన్సర్లతో విద్యార్థి నేతలను బలవంతంగా ఎత్తుకుపోవడం, వారిపై అమానుషంగా దాడి చేయడం వంటి చర్యలు ఆ విశ్వవిద్యాలయంలో నేరాలు వ్యవస్థీకృతమైన తీరుకు, యాజమాన్య నేర ప్రవృత్తికి నిదర్శనాలు.

సినిమాలో విలన్‌లా మోహన్ బాబు నిజజీవితంలో కూడా వ్యవహరించారన్న ఆరోపణలకు సమాధానం చెప్పుకోవాలి. విద్యాసంస్థల్లో సమస్యల పరిష్కారం కోసం విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేయడం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లడం సహజ పరిణామమే. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగింది కూడా ఇదే! కానీ, విద్యాసంస్థ యాజమాన్యం అన్ని పరిధిలను అతిక్రమించి ప్రశ్నించిన వారిని ఎత్తుకెళ్లి, భౌతికదాడులు చేసి, అంతం చేసేలా వ్యవహరించడం ఖచ్చితంగా బరితెగింపునకు నిదర్శనం. సొంత జిల్లాలో ఇంతటి దారుణం జరిగినా సిఎం చంద్రబాబు ఇష్టపి వరకు నోరు మెదపలేదు. దీనిగురించి ఆరా తీయలేదు. మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో ఫీజుల దందాపై దుమారం రేగడం ఇదే మొదటిసారి కాదు. గతంలోనూ అధిక ఫీజుల వసూలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆరోపణలు వచ్చాయి. రకరకాల పేర్లతో సాగిన ఫీజుల దందా శృతి మించడంతో నియంత్రణ సంస్థల జోక్యం, కోర్టుల దాకా ఈ వివాదాలు వెళ్ళాయి. దాదాపు 26 కోట్ల రూపాయలను యాజమాన్యం అక్రమంగా వసూళ్లు చేసినట్లు ఉన్నత విద్యామండలి నిర్ధారించింది.

అక్రమ వసూళ్లకు పాల్పడటంతో 15 కోట్ల రూపాయల జరిమానాను ఉన్నత విద్యామండలి విధించింది. విద్యార్థుల తల్లిదండ్రులు తమ కష్టార్జితాన్ని వెనక్కి తీసుకోవడానికి పోరాటం కొనసాగించారు. మరోసారి ఉన్నత విద్యామండలిని ఆశ్రయించారు. ఇది యాజమాన్యానికి నచ్చలేదు. యూనివర్శిటీ ప్రాంగణానికి వారిని పిలిపించి మోహన్‌బాబు కుమారుడు మంచు విష్ణు బౌన్సర్లతో దాడి చేయించడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివిధ విద్యార్థి సమస్యలపై పోరాటాలు చేసే విద్యార్థి సంఘాలు సహజంగానే ఈ దౌర్జన్యంపై దృష్టి సారించింది. విద్యార్థుల తల్లిదండ్రులకు న్యాయం చేయాలన్న డిమాండ్‌తో ఆందోళన చేపట్టింది, ఇది నచ్చని మోహన్‌బాబు యూనివర్శిటీ యాజమాన్యం విద్యార్థులను బెదిరించడానికి మాఫియా అవతారమెత్తి కిడ్నాప్‌లకు, దాడులకు దిగడం అమానుషం.వివాదం ప్రారంభమైన వెంటనే యాజమాన్యం సంయమనం పాటించి, విద్యార్థులతోనూ, వారి తల్లిదండ్రులతోనూ చర్చించి ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేది కాదు. బయటకు నీతి వాక్యాలు చెప్పే మోహన్ బాబు తన యూనివర్సిటీలో ఇలాంటివి జరగకుండా చూసుకోవాల్సింది. కానీ ఆయనకూడా మైనంగా ఉండడం చూస్తుంటే ఇదంతా తెలిసీ చేస్తున్నారనే ప్రచారం సాగింది. విద్యార్థుల నిరసనను అణచివేయాలన్న దృష్టిలో దాష్టీకాలకు తెగించడం సరికాదు. విద్యార్థులు తమ హక్కుల కోసం ప్రశ్నించడం, నిరసన వ్యక్తం చేయడం ప్రజాస్వామ్య హక్కు. నా యూనివర్ఇసటీ ఇది అని చెప్పడానిక కుదరదు. తాజా వ్యవహారంలో వెంటనే పోలీసులు స్పందించిన తీరు ప్రశంసనీయం. తక్షణమే వారు స్పందించకుంటే బౌన్సర్ల నిర్బంధంలో ఉన్న విద్యార్థి నేతల పరిస్థితి మరింత ఘోరంగా మారి ఉండేది. ఈ వ్యవహారంలో ఇప్పటికే విశ్వవిద్యాలయ పిఆర్‌ఓ సతీష్, మోహన్‌బాబు, మంచు విష్ణులపై కేసులు నమోదయ్యాయి. విచారణ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, కిడ్నాపర్లు, వారి వెనుక వున్న వారిని కఠినంగా శిక్షించాలి. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్పందించి విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్న మోహన్‌బాబు యూనివర్శిటీని బ్లాక్ లిస్టులో పెట్టాలి. వారి తల్లిదండ్రుల నుండి అక్రమంగా వసూలు చేసిన కోట్లాది రూపాయల మొత్తాన్ని వెనక్కి ఇప్పించాలి. విద్యా సంస్థలు మాఫియా ముఠాలుగా మారకుండా, సామాజిక బాధ్యతతో పని చేసేలా, ఫీజులు, సదుపాయాలు, భద్రత వంటి అంశాల్లో అత్యంత పారదర్శకంగా వ్యవహరించేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే! అందుకు చంద్రబాబు ప్రభుత్వం తక్షణం పూనుకోవాలి. విద్యార్థులకు అండగా ఉన్నామని నిరూపించాలి.

# గజ్వేల్ అభివృద్ధి ప్రదాత కేసీఆర్

- మళ్లీ బీఆర్ఎస్‌నే గెలిపద్దాం
- మున్సిపల్ ప్రచారంలో హరీష్ రావు పిలుపు




**సిద్దిపేట, ఫిబ్రవరి 5 :** కేసీఆర్ గజ్వేల్ అభివృద్ధి ప్రదాత అని గజ్వేల్‌లో బీఆర్ఎస్‌ను మళ్ళీ గెలిపించుకోవాలని ఆ పార్టీ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్‌రావు అన్నారు. చెప్పారు. 'కేసీఆర్ రాక ముందు గజ్వేల్ ఎట్లుండే..? ఇప్పుడు ఎట్లుందన్నది ఆలోచించాలన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా గజ్వేల్ నియోజకవర్గంలోని ప్రజ్ఞాపూర్‌లో హరీష్‌రావు పర్యటించారు. అక్కడ పార్టీ శ్రేణులు నిర్వహించిన భారీ రోడ్‌షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేసిన అభివృద్ధిని, రేవంత్‌రెడ్డి వైఫల్యాలను ఎండగట్టారు. 'గజ్వేల్‌లో ఎన్నికలు వచ్చాయి. మనకు అన్నం పెట్టిన వాళ్లకు, మనకు పని చేసిన వాళ్లకు, మనల్ని మంచిగా చూసుకున్న వాళ్లకే ఓటేయాలి. సద్దితిన్న రేవు తలవాలి' అని చెప్పారు. ప్రజ్ఞాపూర్–గజ్వేల్ రోడ్డు అప్పుడు ఎట్లుండే..? ఆ రోజు గజ్వేల్ దవాఖాన పందులకు నిలయంగా ఉండేది. ఈ రోజు 250 పడకల ఆసుపత్రి తెచ్చి పేదలకు కార్పొరేట్ వైద్యం అందించింది కేసీఆర్. గజ్వేల్‌కు ఆర్డీవో ఆఫీస్, రైలు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఊర చెరువు, పాండవుల చెరువు సుందరీకరణ చేసింది కేసీఆర్ కాదా..? కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పేదింటి ఆడబిడ్డ పెళ్లికి 1,00,116 అందించి మేనమామలా ఆదుకున్నది కేసీఆర్. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవిస్తే కేసీఆర్ కిట్‌తోపాటు 13,000 అందించిన ఘనత కేసీఆర్‌ది' అన్నారు. 'మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలు, బీసీ, ఎస్సీ, మైనార్టీ బిడ్డల కోసం గురుకులాలు స్థాపించి చదువుల విప్లవం తెచ్చింది కేసీఆర్. ఒకప్పుడు గజ్వేల్‌లో మూడు రోజులకోసారి నీళ్లు వచ్చే పరిస్థితి పోయి.. ప్రతి ఇంటికి నల్లా ద్వారా మంచినీళ్లు అందించారు. బిందెలు పట్టే కష్టం లేకుండా చేసి, మహిళల కష్టాలు తీర్చింది కేసీఆర్. రైతుబంధు ఎందుకు వేయలేదు అంటే ఎలక్షన్ అయ్యాక ఇస్తా అంటున్నాడు రేవంత్. కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ 11 సార్లు రైతుబంధు ఆపలేదు. ఇంటింటికీ బియ్యం, మందులు పంపారు. కానీ రేవంత్ రెడ్డి వచ్చాక ఇప్పటికీ రెండు రైతుబంధులు ఎగ్గొట్టిండు. ఇది మూడోది. ఎగ్గొట్టిన రెండు, ఇప్పుడు రావాల్సిన ఒకటి కలిపి మూడు రైతుబంధులు వెంటనే వేయాలని డిమాండ్ చేస్తున్నాం. కావాలంటే మాకు అభ్యంతరం లేదని ఎలక్షన్ కమిషన్‌కు మేమే లేఖ ఇస్తాం. 11వ తేదీలోగా రైతుబంధు వేయకపోతే రైతులు నిన్ను చీల్చి చెండాడుతారు' అని హరీష్‌రావు హెచ్చరించారు. 'త్యాగాలతో, ఆమరణ దీక్షతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహనీయుడు, తెలంగాణ జాతిపిత కేసీఆర్. రేవంత్ రెడ్డి నోరు తెరిస్తే చాలు బూతులు మాట్లాడే బూతుల పిత. ఎంతో కష్టపడి తెచ్చుకున్న తెలంగాణను రేవంత్ రెడ్డి ఆగమాగం చేస్తుండు. సర్వనాశనం చేసిండు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి.. పెన్షన్ అడిగితే లాగుల తొండలు వదులుతా, హామీలు అడిగితే పేగులు మెడలో వేసుకుంటా అంటాడు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్లి వచ్చానని చెప్పుకునే రేవంత్ రెడ్డి బుద్ధి.. కుక్క తోక వంకర అన్నట్టే ఉంది. గతంలో రూ. 400 ఉన్న పెన్షన్‌ను రూ.2000 చేసింది కేసీఆర్. రేవంత్ రెడ్డి రూ.4000 ఇస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి సగం కాలం గడిచినా ఒక్క రూపాయి పెంచలేదు. ఇప్పటివరకు ఒక్కో అవ్వతాతకు రూ.52,000 ప్రభుత్వం బాకీ పడింది' అని చెప్పారు. 'మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నాడు. ఎవరికైనా వచ్చిందా..? ఫ్రీ బస్సు అని మగోళ్లకు డబుల్ టికెట్ కొట్టి, ఆడవాళ్లకు తిప్పలు పెట్టారు. పువ్వు గుర్తు వాళ్ళు ఎన్నడైనా ఒక్క రూపాయి పని చేశారా..? అక్షింతలు పంచడం తప్ప ఏమైనా చేశారా..? యాదాద్రి నరసింహ స్వామి గుడి కట్టింది కేసీఆర్. గజ్వేల్ వెంకటేశ్వర స్వామి గుడి, రామాలయం, శివాలయం అద్భుతంగా కట్టించింది కేసీఆర్. పనిచేసే వాళ్లకు ఓటేద్దామా..? అక్షింతలు వేసే వాళ్లకు ఓటేద్దామా..? కేసీఆర్ ముస్లిం మైనార్టీ పిల్లల చదువు కోసం ఆలోచించి రెసిడెన్షియల్ స్కూల్స్ పెట్టారు. షాదీ ముబారక్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి వచ్చాక మైనార్టీల కోసం ఒక్క రూపాయి పనిచేశారా..? ఎరువు బస్తాలు ఇచ్చే తెలివి లేదు. చేతగాని దద్దమ్మ రేవంత్ రెడ్డి' అని హరీష్‌రావు మండిపడ్డారు. రేవంత్‌రెడ్డీ నువ్వు కేసీఆర్‌ని తిడతావా..? నీ మొఖానికి పండిన వడ్లు కొనే తెలివిలేదు. దళితబంధు బంద్ పెట్టి రాష్ట్రాన్ని ఆగమాగం చేస్తున్నావు. మన తెలంగాణను కాపాడు కోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటేయాలి. ఇప్పుడు గెలిచిన కౌన్సిలర్లు ఐదేళ్లు ఉంటారు. రెండేళ్లలో వచ్చేది మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వమే. ప్రజ్ఞాపూర్ గౌరవం నిలబడాలంటే బీఆర్ఎస్ గెలవాలి' అని చెప్పారు. వంటేరు ప్రతాపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇప్పటికే మోసపోయాం..
# మరోసారి మోసపోవద్దు

- సూర్యాపేట పట్టణంలో గులాబీ జెండా ఎగరడం ఖాయం
- రేవంత్ అజ్ఞానంతో చేస్తున్న విమర్శలను తిప్పికొట్టాలి
- బిఆర్ఎస్ నేత, మాజీ జగదీష్‌రెడ్డి పిలుపు



**సూర్యాపేట, ఫిబ్రవరి 5 :** మోసపోతే గోసపడతామని కేసీఆర్ ఎన్నోసార్లు చెప్పిండు. కాంగ్రెస్ మాయగాళ్ళను నమ్మినందుకు నట్టేట ముంచింద్రు. మరోసారి మోసపోకుండా జాగ్రత్త పడాలి. మున్సిపల్ ఎన్నికల్లో అరాచక కాంగ్రెస్‌ను ఓడించాలి. అభివృద్ధికి కేరాఫ్‌గా ఉన్న బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థులకు పట్టంకట్టాలి. సూర్యాపేట మున్సిపాలిటీలో గులాబీ జెండా ఎగరడం ఖాయం అని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి ధీమా వ్యక్తంచేశారు.పుట్టుకతో అజ్ఞానం ఉంటే జ్ఞానం పెరగదని, అందుకు రేవంత్‌రెడ్డే ఉదాహరణ అని జగదీష్‌రెడ్డి అన్నారు. మిర్యాలగూడ సభలో రేవంత్ చేసిన వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. హార్వర్డ్ యూనివర్సిటీకి వెళ్తే అందరికీ జ్ఞానం పెరుగుతదని, కానీ రేవంత్‌రెడ్డికి ఉన్న జ్ఞానం పోయిందని అన్నారు. సీఎం స్థాయికి తగ్గట్టుగా కాకుండా దిగజారి మాట్లాడుతున్నాడని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సమస్యల మీద మాట్లాడకుండా బూతులు వ్లలెవేస్తున్నడని, ప్రజలకు ఎం చేస్తాడో చెప్పకుండా అర్థంలేని ఆరోపణలు చేయడం సరికాదని జగదీష్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ చేసిన మోసాలను కప్పిపుచ్చేలా రేవంత్ రోత మాటలు మాట్లాడుతున్నారని, గాంధీలా ఆమరణదీక్ష చేసి తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను స్వాతంత్యం÷–ర తెచ్చిన గాంధీతో పోలుస్తూ తెలంగాణ ప్రజలు జాతిపిత అంటున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డికి గతంలో చంద్రబాబు, ఇప్పుడు సోనియా జాతిపితలని, భవిష్యత్తులో మోడీ కూడా జాతిపిత అవుతారేమోనని ఎద్దేవా చేశారు.'రేవంత్ అజ్ఞానంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడు. నల్గొండ జిల్లా పర్యటనలో నిబంధనలకు వ్యతిరేకంగా రేవంత్ శంకుస్థాపనలు చేశాడు. సీఎం జిల్లాకు వస్తే ఏదో ప్రకటిస్తారని ప్రజలు ఆశిస్తారు. కానీ స్థాయి పెరిగినా అవే బూతులు. అర్థంలేని ఆరోపణలు. సీఎం గా రెండేళ్లు గడిచినా రోజురోజుకు సంస్కారహీనత పెరిగిపోతుంది. ఉన్న సమస్యలను పక్కనపెట్టి ప్రజలను పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నడు. కాంగ్రెస్ సభల్లో ఆయన రోత మాటలతో బిఆర్ఎస్ కు మరింత బలం పెరుగుతున్నది. కాంగ్రెస్ ది బాగుచేసే పనికాదు చెడగొట్టే పనే' అని జగదీష్‌రెడ్డి విమర్శించారు. 'కేసీఆర్ హయాంలో చేసిన అభివృద్ధిని ఆగం చేస్తున్నరు. అభివృద్ధితోపాటు పదేండ్లలో పెంచిన పచ్చదనాన్ని ఎండబెడుతున్నారు. కాంగ్రెస్ మాయమాటలు నమ్మి మోసపోయింద్రని అన్నారు.



## బిఆర్ఎస్‌లో ఉంటే కాంగ్రెస్‌కు ప్రచారమేంటి?

**ఎమ్మెల్యే బండ్ల తీరుపై బిఆర్ఎస్ శ్రేణుల విమర్శలు**

**గద్వాల, ఫిబ్రవరి 5 :** అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ తరఫున గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి బరితెగించారు. బీఆర్ఎస్ అనర్హత పిటిషన్ వేస్తే.. తాను బీఆర్ఎస్ పార్టీలోనే ఉన్నానని, పార్టీ ఫిరాయించలేదని చెప్పుకున్న కృష్ణమోహన్‌రెడ్డి.. ఇప్పుడు కాంగ్రెస్ తరఫున ప్రచారం చేస్తున్నాడని స్థానిక బిఆర్ఎస్ నేతలు మండిపడ్డారు. స్పీకర్ అనర్హత పిటిషన్‌ను కొట్టేయడంతో గద్వాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రచారాన్ని భుజానికి ఎత్తుకుని తిరుగుతున్నారు. ఇవాళ మున్సిపాలిటీలో తిరుగుతూ కాంగ్రెస్ కరపత్రాలను ఓటర్లకు పంచుతున్నారు. కాంగ్రెస్ పార్టీకే ఓటేయమని ఓటర్లను అడుగుతున్నారు. నిన్న మొన్నటి వరకు అంటి ముట్టనట్లు ఉన్న బండ్ల ఇవాళ బరితెగించి హస్తం గుర్తు ఉన్న కరపత్రాలను బహిరంగంగా పంచడం చర్చనీయాంశంగా మారింది. స్పీకర్ ఇప్పుడైనా కళ్ళు తెరిచి ఫిరాయింపు ఎమ్మెల్యేపై బండ్లపై చర్య తీసుకోవాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేస్తున్నాయి.

# వైసిపి హయాంలో వరుసబెట్టి హిందుత్వపై దాడులు

- ఆలయాలు ధ్వంసం.. రథం దగ్ధం..ఆభరణాల చోరీ
- సిట్ నివేదికలో వైసిపికి ఎక్కడా క్లీన్‌చిట్ ఇవ్వలేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ ఆగ్రహం



**అమరావతి, ఫిబ్రవరి 5 :** తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. సిట్ నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కళ్యాణ్ మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ది కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడు కొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు. నెయ్యి కల్తీ అంశంలో మతాల ప్రస్తావన లేదని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. 'తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారు. శ్రీవారి విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారు. సిట్ రిపోర్ట్ ఎక్కడా వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు. రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది. భగవంతుడితో పెట్టుకున్నవారు సర్వనాశనం అయిపోతారు తప్ప బతికున్న దాఖలాలు లేవు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలి. భగవంతుడికి మొకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టం. హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరం. 2022లోనే కల్తీ నిర్ధారణ అయ్యిం ది. అయినా అయోధ్యకు అవే కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారు' అని పవన్ కళ్యాణ్ ధ్వజమెత్తారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. 'అన్ని నివేదికలు.. ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయి. ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారి స్తే, తమ వద్ద అలాంటి పరీక్ష చేసే సామర్థ్యం లేదని ఎన్డీఆర్ఐ చెప్పింది. ప్రతీమాట భక్తుల మనోభావాలు, సెంటిమెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాం. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నాం. ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవు తుందనే నిజాలు బయటపెడుతున్నాం. వైసీపీ హయాంలో పెద్దఎ త్తున దేవాలయాలపై దాడులు జరిగితే ఎలాంటి చర్యలు తీసు కోలేదు' అని పవన్ కళ్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.



## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

### ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

**సూర్యాపేట, నేడు న్యూస్:** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఇటీవల మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. 2025 డిసెంబర్ 24న కేతెపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చీకటిగూడెం వద్ద విజయవాడ వైపు జాతీయ రహదారిపై వెళ్తున్న కారు టైరు పగిలింది. దీంతో కారు అదుపు తప్పి డివైడర్ కు తగిలి అవతలి వైపు పడింది. అదే సమయంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న మరో కారు ప్రమాదంలో చిక్కుకుంది. ఈ ప్రమాదంలో రెండు కార్ల డ్రైవర్లు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించారు. రెండు కార్లలో మహిళలు మాత్రమే ఉన్నట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ బందెల అనిల్ కుమార్(50) చికిత్స పొందుతూ గత నెలలో మృతి చెందారు.

## 9న అల్వాల్‌లో అప్రెంటిస్ మేళా

**మేడ్చల్ నేడు బ్యూరో:** ఈ నెల 9న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్ మేళ కింద అల్వాల్ ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ లో ఐ.టి.ఐ పాసైన యువతీ యువకులకు అప్రెంటిస్ మేళ నిర్వహించనున్నామని ఆ ఐ.టి.ఐ ప్రిన్సిపాల్ శంకరయ్య తెలిపారు. గురువారం ఆయన ఈ మేరకు పత్రికా ప్రకటన చేస్తూ, ఈ అప్పెంటిస్ మేళకు ప్రైవేట్ సంస్థలైన వేం టెక్నాలజీ, మేధా సర్వో డ్రైవ్స్, లింక్ వెల్, హెచ్.బి.ఎల్ పవర్ సిస్టమ్ లిమిటెడ్, తైసీన్ క్రూప్ ఇండస్ట్రీస్ ఇండియా, స్మార్ట్ వేస్, వరుణ్ మోటార్స్ మొత్తం 20 నుండి 30 కంపెనీలు హాజరవుతాయన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్, జీరాక్స్ కాపీ సర్టిఫికెట్స్ బయోడేటా తీసుకొని పైన తెలిపిన అప్రెంటిస్ మేళ కు హాజరుకావాలని వెల్లడించారు. ఈ అప్రెంటిస్ మేళకు సంబంధించి ఇతర వివరాలకు ఫోన్ నెంబర్: 8985415042 కు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల లోపు సంప్రదించాలని పి. శంకరయ్య వివరించారు. పేర్ల నమోదును https://www.apprenticeshipindia.gov.in, https://www.apprenticeshipindia.gov.in రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

## 13 నుంచి 18 వరకు కీసరగుట్ట జాతర క్రీడోత్సవాలు

**మేడ్చల్, నేడు బ్యూరో:** కీసరగుట్ట దేవాలయ శాఖ, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కీసరగుట్ట బ్రహ్మోత్సవాల జాతర జిల్లా స్థాయి క్రీడోత్సవాలు ఈ నెల 13 నుంచి 18 వరకు నిర్వహించనున్నారు. ఇందులో, పాఠశాల క్రీడోత్సవాలు (బాయ్స్ అండ్ గర్ల్స్) 13,14 తేదీలలో కబడ్డీ, కోకో, వాలీబాల్ పోటీలు జరుగుతాయని, అలాగే యువత క్రీడోత్సవాలు (బాయ్స్) 17,18 లలో కబడ్డీ, కోకో వాలీబాల్ లలో జరుగుతాయి. జిల్లాలోనీ పాఠశాలలు, క్రీడాకారులు, యువజనులు పైన తెలిపిన తేదీలలో కీసర గుట్ట క్రీడోత్సవాలలో పాల్గొని, విజయవంతం చేయాలని జిల్లా యువజన, క్రీడల అధికారి దామోధర్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయ కుమారి, కీసరగుట్ట దేవాలయ చైర్మన్ టి. వెంకటేష్, కీసరగుట్ట దేవాలయ కమిటీ మెంబర్స్, ఎస్టీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కిష్టయ్య లు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో బుధవారం వెల్లడించారు. ఇందులో పాల్గొనే వారు రిజిస్ట్రేషన్, ఎంట్రీస్ ఈ నెల 11న సాయంత్రం 5 గంటల వరకు ఎం.ఎస్.సీ కీసర లో నమోదు చేసుకోవాలని, ఆ తరువాత వచ్చినవి ఎంట్రీస్ లను స్వీకరించబడవన్నారు. అలాగే, 12న ఉదయం 11 గంటలకు ఎం.ఆర్.సీ కీసర లో డ్రాస్ తీస్తారు. పూర్తి వివరాలకు జిల్లా ఎస్.టీ.ఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బి.కిష్టయ్య – 9441812050 నంబర్లకు సంప్రదించవచ్చు.



## ప్రభుత్వ స్థలాలను పరిరక్షిస్తాం

### తాసిల్దార్ బైరెడ్డి రాజేష్



**జవహర్ నగర్, నేడు న్యూస్ :** ప్రభుత్వ స్థలాలను పరిరక్షించి ప్రజా అవసరాల కోసం వినియోగిస్తామని కాప్రా మండల తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ అన్నారు. గురువారం జవహర్ నగర్ లోని సర్వే నెంబర్లు 696, 695 లో కబ్జాదారుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని రెవెన్యూ ఇన్స్పెక్టర్లు సత్యనారాయణ, రమేష్ నాయక్ లు స్వాధీనం చేసుకున్నారు. సుమారు 20 గుంటల భూమి చుట్టూ రెవెన్యూ అధికారులు కంచె నిర్మాణం చేపడుతుండగా స్థానికులు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడమే తమ ధ్యేయమన్నారు. ప్రభుత్వ స్థలాలు ఆక్రమించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నా రు. ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి కొందరు వ్యక్తులు ప్లాట్లు చేసి పేదలకు అమ్ముతున్నట్లు గుర్తించామన్నారు. ప్రభుత్వ స్థలాలలో ప్లాట్లు కొని మోసపోవద్దని కొనుగోలుదారులను హెచ్చరించారు. జవహర్ నగర్ లో కబ్జాదారుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించామని, అట్టి స్థలాలను త్వరలోనే స్వాధీనం చేసుకుని కంచె నిర్మాణాలు చేపడతామని ఆయన తెలిపారు.

# ప్రలోభాల పర్వం

- పురపాలక సంఘం ఎన్నికలలో యువకులకు మాంసం, మద్యంతో దావత్
- ఓటు పక్కదారి పట్టకుండా ముందస్తు చర్యలు
- కాలనీలో నేతల హామీల వర్షం
- డబ్బు, మద్యంతో ఓటర్లకు ఎర



**మేడ్చల్, నేడు న్యూస్ :** ఎల్లంపేట పురపాలక సంఘం ఎన్నికల రాజకీయం వేడెక్కుతోంది. పురపాలక సంఘం ఎన్నికలు షెడ్యూల్ విడుదల అయినప్పటి నుంచి ఆశావహులు ప్రచారాలు ప్రారంభించారు. నామినేషన్ వేసిన అభ్యర్థులు, పార్టీ ఆశావహులు వార్డులలో ఉన్న యువకులకు దావత్లు ఇస్తున్నారు. ముందు మందు పార్టీలు, తర్వాత ఓటుకు నగదు ఇస్తామని ఒప్పందాలు చేసుకుంటున్నారు. పురపాకలక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు యువకులకు మాంసం, మద్యంతో గాలం వేస్తు యువతను మచ్చిక చేసుకుంటున్నారు. కొంతమంది నాయకులు వైన్స్ దుకాణాల యాజమానులతో మాట్లాడి తమ వార్డు ఓటర్లు అభ్యర్థుల పేర్లు చెప్తే వారికి మద్యం ఇవ్వాలని ఒప్పందాలు చేసుకుంటున్నారు.

### పెద్దలకు హామీల వర్షం :

పురపాలక ఎన్నికలలో ఆయా వార్డులలోని ఓటర్లు చెప్పే ప్రతి పని చేస్తామని పోటీ చేసే అభ్యర్థులు కాలనీ పెద్దలకు హామీలు ఇస్తున్నారు. తాము గెలిచిన పెత్తనం అంత మీదనేనని మీరు ఎలా చెబితే అలా నడుచుకుంటానని జోరుగా మంతనాలు సాగిస్తున్నారు. పురకపాలక సంఘం పరిధిలోని అన్ని వార్డుల్లో అభ్యర్థులు హామీలు ఇస్తూ ఓటర్లను మచ్చిక చేసుకునే పనిలో అభ్యర్థులు బీజీగా ఉన్నారు. ఎన్నికల బరిలో దిగిన వ్యక్తులు ఓటుకు నోటు ఇవ్వనున్నట్లు సమాచారం.

## అభ్యర్థుల గెలుపు కోసం విస్తృత ప్రచారం

- జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో భైంసా తరలివెళ్లిన మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు
- భైంసా పట్టణంలో పీర్జాదిగూడ బీఆర్ఎస్ నాయకుల ప్రచారం



**పీర్జాదిగూడ, నేడు న్యూస్:** పట్టణంలో బీఆర్ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ గులాబీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నాను. పీర్జాదిగూడ నగర మాజీ మేయర్, భైంసా మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి జక్క వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పీర్జాదీగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలోని మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున భైంసాకు తరలివెళ్లారు. స్థానిక బీఆర్ ఎస్ నాయకులతో కలిసి భైంసా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపుకోసం విస్తృత ప్రచారం చేస్తున్నారు. భైంసా మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు అఖండ మెజారిటీతో గెలుస్తారని వెంకట్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గత దశాబ్దంన్నర కాలంగా భైంసా ప్రజలు మతతత్వ బీజేపీ, ఎంఐఎం పార్టీలతో విసుగు చెందారని, ఈ క్రమంలోనే బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రచారానికి ప్రజల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, మధుసూదన్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ ప్రభు, ఆంజనేయులు, శ్యామల శ్రీనివాస్ రామకృష్ణ, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, శేఖర్, కిరణ్ నాయక్, రమేష్, నాగిరెడ్డి, లోకేష్ పాల్గొన్నారు.



## మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు పక్కా.

### బిఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం ఇంటింటి ప్రచారం

**పరకాల, నేడు న్యూస్:** పరకాల మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, పరకాల పట్టణంలోని 6,7,8,9,10,11,2021, వార్డులలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా ఇంటింటి ప్రచారలో,కార్నర్ మీటింగ్స్ పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ ఎస్ ప్రవీణ్ కుమార్ పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మున్సిపాలిటీ కో ఆర్డినేటర్,మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, మోసపూరిత హామీలను ప్రజలకు వివరించి, బిఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వమంటూ చెప్పుకుంటూ ప్రజలను మోసం చేస్తోంది. ఆ పార్టీ అబద్ధపు హామీలే కాంగ్రెస్‌ను రాజకీయంగా బొందపెడతాయి. పరకాల పట్టణ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. పరకాల పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత పూర్తిగా బిఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. గడిచిన రెండేళ్లుగా స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే పరకాల పట్టణానికి పట్టిన శనిలా మారారని, ఇప్పటి వరకు తట్టెడు మట్టి కూడా పోయని దుస్థితి నెలకొందని విమర్శించారు. మా హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు ఇప్పుడు రంగులు వేసుకుని, తామే చేశామని కాంగ్రెస్ నేతలు గప్పాలు కొడుతున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ హయాంలో వేసిన శిలాఫలకాలను ధ్వంసం చేసి, కొత్తవి పెట్టుకోవడం కాంగ్రెస్ నేతల దుర్మార్గ రాజకీయానికి నిదర్శనమన్నారు. పరకాల పట్టణానికి కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేని స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని, పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టే సమయం కూడా స్థానిక ఎమ్మెల్యేకు లేదని తీవ్ర విమర్శలు చేశారు. రెండేళ్ల కాంగ్రెస్ దగా పాలనలో రాష్ట్ర ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ప్రజాపాలన కాదు.. పర్సంటేజీల పాలన కొనసాగుతోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాటలు విని మళ్లీ మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌ను ఎప్పుడెప్పుడు గద్దె దించాలా అని ప్రజలు ఎదురు చూస్తున్నారని, మళ్లీ కేసీఆర్ గారే ముఖ్యమంత్రి కావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. మున్సిపాలిటీ ఎన్నికల్లో బోగస్ కాంగ్రెస్‌కు ప్రజల చేతుల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ కౌన్సిలర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు,యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 7, 8 తేదీలలో పోస్టల్ బ్యాలెట్

## ఓటు హక్కును వినియోగించుకోవాలి


### నోడల్ ఆఫీసర్ ఝాన్సీ రాణి



**మేడ్చల్ నేడు బ్యూరో:** మున్సిపాలిటీల రెండవ సాధారణ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల విధుల్లో నియమించబడిన మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతల పల్లిలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును వినియోగించు కునేందుకు వీలుగా జిల్లా కలెక్టర్ స్పెషల్ క్యాజువల్ లీవ్ కు అనుమతి ఇచ్చారని పోస్టల్ బాలట్ పేపర్ నోడల్ ఆఫీసర్ ఝాన్సీ రాణి వెల్లడించారు. జిల్లాలో ఎల్లంపేట్, అలియాబాద్, మూడుచింతల పల్లిలో ఓటు హక్కు కలిగి ఉండి, ఎన్నికల విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, పోలీసు సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవసరమైన సౌకర్య కేంద్రాన్ని మున్సిపల్ కార్యాలంలో ఈ నెల 7 నుంచి 8 తేదీలలో ఉదయం 10.30 నుండి సాయం త్రం 5.00 గంటల వరకు ఏర్పాటు చేసినట్టు ఆమె తెలిపారు. అందువల్ల జిల్లాలో ఎన్నికల విధుల్లో నియమించబడిన ఉద్యోగులందరూ ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని, తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగిం చుకోవలసిందిగా ఆమె కోరారు. అదేవిదంగా పోటీలో ఉన్న అభ్యర్థుల ఏజెంట్ లు కూడా మున్సిపల్ కార్యాలంలో హాజరు కావాలని నోడల్ ఆఫీసర్ ఝాన్సీ రాణి కోరారు.

# సంస్థ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యత

- విశిష్ట సేవలు అందించి ప్రయాణికుల విశ్వాసాన్ని పెంపొందించాలి
- ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఈడీ ఎం రాజశేఖర్





**బోడుప్పల్, నేడు న్యూస్:** చెంగిచెర్ల ఆర్టీసీ సంస్థ అభివృద్ధి ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రయాణికులకు భద్రత, సమయపాలన, మర్యాదైన సేవ అందించడం ద్వారా ఆర్టీసీపై ప్రజల విశ్వాసాన్ని మరింత పెంపొందిం చాలని ఆర్టీసీ గ్రేటర్ హైదరాబాద్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ జోన్ పరిధిలోని చెంగిచెర్ల డిపోను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం. రాజశేఖర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపోలోని గ్యారెజ్, ఆయిల్ రూమ్, వాషింగ్ ప్లాంట్, మెకానికుల పనితీరు, బస్సుల నిర్వహణ ప్రమాణాలు, ఇంధన విని యోగం–ఆదా, వచ్చిన ఆదాయం వంటి కీలక అంశాలను సమగ్రంగా పరిశీలించారు. డిపోలో బస్సుల ఫిట్‌నెస్, రిపేర్ పనుల నాణ్యత, సమయపాలనపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, ప్రతి బస్సు రోడ్డు మీదకు వెళ్లే ముందు సాంకేతికంగా పూర్తిగా సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వాషింగ్ ప్లాంట్‌లో శుభ్రత ప్రమాణాలు పాటించడంపై, ఆయిల్ రూమ్‌లో భద్రతా నియమాలు కచ్చితంగా అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇంధన ఆదా చర్యలపై వివరాలు తెలుసుకున్న రాజశేఖర్, డ్రైవర్లకు మైలేజ్ మెరుగుపరచే శిక్షణా కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని సూచిం చారు. డిపో ఆదాయ వృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసి, ప్రయాణికుల సంఖ్య పెంపుపై దృష్టి పెట్టాలని తెలిపారు. సమయపాల న, టికెట్ ఆదాయం,హొలాభనష్టాల విశ్లేషణ వంటి అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఖర్చు తగ్గింపు, ఆదాయ వృద్ధి అనే రెండు లక్ష్యాలతో సమన్వయంగా పనిచేస్తే డిపోను ఆదర్శంగా తీర్చిదిద్దవచ్చు" అని అన్నారు. డిపో నిర్వహణ పని తీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ తనిఖీలో జీ హెచ్ జెడ్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఆపరేషన్) టీ శ్రీనివాస్ రావు, డిపో మేనేజర్ కవిత, అసిస్టెంట్ మేనేజర్ (పర్సనల్) కే మురళి కృష్ణ, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్)ఆనంద రావు, అసిస్టెంట్ మేనేజర్ (మెకానిక్) సత్తయ్య తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


## నలభై ఏళ్ల నమ్మకానికి దక్కిన బహుమానం

# బీ-ఫారం ఇవ్వకపోవడం

### ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిండ్ల రాహుల్ యాదవ్

- రాజకీయాల్లో విశ్వాసానికి విలువేది ?
- పార్టీ సిద్ధాంతాన్ని నమ్మి జెండాను భుజాన వేసుకుని నలభై ఏళ్ల పాటు నడిచిన అడుగులకు నేడు అడ్రస్ లేకుండా పోయింది
- కష్టకాలంలో పార్టీని కాపాడిన మాకు గుర్తింపు లేనప్పుడు, కొత్తగా వచ్చే వారికి పార్టీ విలువలపై నమ్మకం ఎలా ఉంటుంది
- నిజాయితీ గల కార్యకర్తలను విస్మరిస్తే, భవిష్యత్తులో పార్టీ పునాదులు బలహీనపడే ప్రమాదం ఉంది
- ఎండనక వాననక జెండాను రెపరెపలాడించిన మామిండ్ల రాహుల్ యాదవ్ ప్రయాణం కార్యకర్తలకు స్ఫూర్తిదాయకం







రాజకీయాల్లో విశ్వాసానికి విలువేది ? పదవులు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ సిద్ధాంతాన్ని నమ్మి, జెండాను భుజాన వేసుకుని నలభై ఏళ్ల పాటు నడిచిన అడుగులకు నేడు అడ్రస్ లేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ కోసం తన జీవితాన్ని ధారపోసిన ఎన్ఎస్ యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఒక సీనియర్ కార్యకర్త కుటుంబానికి ఈ ఎన్నికల్లో 'బీ-ఫారం' దక్కకపోవడం ఇప్పుడు స్థానికంగా చర్చనీయాంశమైంది.

**మేడ్చల్, నేడు న్యూస్ :** పార్టీ అధికారంలో ఉన్నా లేకపోయినా, ఎండనక వాననక కాంగ్రెస్ జెండాను రెపరెపలాడించిన సదరు కార్యకర్త ప్రయాణం వందలమంది కార్యకర్తలకు స్ఫూర్తిదాయకం. ఇందిరమ్మ కాలం నుండి రాహుల్ గాంధీ వరకు పార్టీ పిలుపునిచ్చిన ప్రతి పోరాటంలో ముందున్నారు. తన వ్యక్తిగత ఆస్తులను సైతం పార్టీ కార్యక్రమాల కోసం ఖర్చు చేసి, కార్యకర్తలను ఏకోన్ముఖం చేసిన చరిత్ర ఆయన కుటుంబానిది. అలాంటి కుటుంబానికి టికెట్ కేటాయింపు సమయంలో 'విధేయత', 'విజయావకాశాల కంటే 'ఆర్థిక బలం' అనే సమీకరణాలకే అధిష్టానం ప్రాముఖ్యత ఇవ్వడం ఆ కార్యకర్తను కోలుకోలేని దెబ్బ తీసింది.

**అధిష్టానం తీరుపై పెల్లుబెకుతున్న ఆగ్రహం :**

పారాచూట్ నాయకులకు పట్టం కడతారా? పార్టీని నమ్ముకున్న మమ్మల్ని నడిరోడ్డుపై వదిలేస్తారా?" అని సదరు కార్యకర్త అనుచరులు ప్రశ్నిస్తున్నారు. బీ-ఫారం నిరాకరించడం అంటే కేవలం ఒక వ్యక్తికి టికెట్ ఇవ్వకపోవడం కాదు, నలభై ఏళ్ల త్యాగాన్ని అవమానించడమేనని కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేము జెండా మోసింది పదవుల కోసం కాదు, పార్టీ సిద్ధాంతం కోసం. కానీ కష్టకాలంలో పార్టీని కాపాడిన మాకు గుర్తింపు లేనప్పుడు, కొత్తగా వచ్చే వారికి పార్టీ విలువలపై నమ్మకం ఎలా ఉంటుందని పలువురు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**కార్యకర్తలే పార్టీకి ప్రాణం :**

నాయకులు మారుతుంటారు, కానీ కార్యకర్తలు శాశ్వతం. క్షేత్రస్థాయిలో పార్టీని బతికించేది వీరే. ఇలాంటి నిజాయితీ గల కార్యకర్తలను విస్మరిస్తే, భవిష్యత్తులో పార్టీ పునాదులు బలహీనపడే ప్రమాదం ఉంది. అధిష్టానం ఇప్పటికైనా పార్టీని నమ్ముకున్న వారికి సముచిత గౌరవం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.





## సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్‌ను సన్మానించిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సేన నాయకులు

**దేవరుప్పుల నేడు న్యూస్:** సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సేన జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన గౌడ సర్పంచ్ లకు,ఉపసర్పంచ్ లకు గౌడ ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహించారు.అందులో భాగంగానే దేవరుప్పుల మండలంలోని దేవరుప్పుల గ్రామ సర్పంచ్ పెద్ది కృష్ణమూర్తి గౌడ్ ను ఘనంగా శాలువతో సన్మానించి షీల్డును అందజేసి శుభాకాంక్షలు తెలిపిన సర్ధార్ సర్వాయి పాపన్న గౌడ సేన సంఘం నాయకులు. ఈ కార్యక్రమంలో సుప్రజ హాస్పిటల్ ఎండి డాక్టర్ శివ,విజయ్ గౌడ్,ఘనగాని మల్లేష్ గౌడ్,బత్తిని రాజు గౌడ్,జాజుల శ్రీనివాస్ గౌడ్,నూతి శ్రీకాంత్ గౌడ్,చెరుకు సుధాకర్ గౌడ్,రేఖ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ పోటీల్లో కారేపల్లి మైనారిటీ విద్యార్థినీల సత్తా

### జిల్లా స్థాయి పోటీలకు ఘన అర్హత

**కారేపల్లి నేడు న్యూస్ :** వైరా నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన సీఎం కప్ క్రీడా పోటీల్లో కారేపల్లి మైనారిటీ పాఠశాల విద్యార్థినీలు తమ క్రీడా సత్తాను చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికై కారేపల్లి గ్రామానికి గర్వకారణంగా నిలిచారు. ఖో--ఖో విభాగంలో ఎస్.కె. ఆరిఫా, జె. అక్షిత చురుకుదనం, సమన్వయంతో ఆడి విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత పొందారు. అలాగే వాలీబాల్ విభాగంలో ఎస్.కె. సోనీ, ఎస్.కె. సుజాత పట్టుదలతో ఆడి జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ విజయాల వెనుక పాఠశాల ప్రిన్సిపల్ డి. సావిత్రి ప్రోత్సాహం, అలాగే శారీరక విద్య ఉపాధ్యాయులు పీఈటీ ఎస్. నాగేంద్రమ్మ, పీడీ అనూష కృషి ముఖ్యమైనదిగా నిలిచింది. విద్యార్థినీలలోని ఆటల ప్రతిభను ముందుగానే గుర్తించి, వారికి సరైన శిక్షణ ఇచ్చి, నిరంతరం ప్రోత్సహిస్తూ పోటీలకు సిద్ధం చేయడం వల్లే ఈ స్థాయి విజయం సాధ్యమైందని ఉపాధ్యాయులు తెలిపారు. క్రీడల ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, జిల్లా స్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించి పాఠశాల ప్రతిష్ఠను మరింత పెంచాలని వారు ఆకాంక్షించారు. కారేపల్లి మైనారిటీ విద్యార్థినీల ఈ ఘన విజయం గ్రామ యువతకు స్ఫూర్తిగా నిలుస్తుందని స్థానికులు ప్రశంసించారు.

## లక్ష్మాపూర్ రైతుల భూములకు సర్వే నెంబర్లు ఇప్పించాలి

- మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ డిమాండ్
- మూడుచింతలపల్లిలో బిజెపి అభ్యర్థుల గెలుపుకు ప్రచారం
- బిజెపి అభ్యర్థులను గెలిపించండి





**మేడ్చల్, నేడు బ్యూరో:** మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని లక్ష్మాపూర్ రైతుల భూములకు సర్వే హక్కులు ఎందుకు ఇప్పించలేక పోతున్నావు సీ.ఎం రేవంత్ రెడ్డి అని మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ప్రశ్నించారు. ఈ గ్రామానికి సర్వే నెంబర్స్ ఇచ్చే వరకు వదిలేది లేదని, బిజెపి ఇక్కడి రైతులకు అండగా ఉంటుందని ఈటెల భరోసా ఇచ్చారు. మునిసిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా, ఈటెల రాజేందర్ గురువారం మేడ్చల్ జిల్లాలోని మూడుచింతలపల్లి మున్సిపాలిటీ లక్ష్మపూర్, మూడు చింతల పల్లితో పాటు సమీప గ్రామాల్లో బీజేపీ అభ్యర్థుల తరపున ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ మాట్లాడు తూ, బిజెపి అభ్యర్థులు గొంది దివ్య, లాజిశెట్టి రమ్య లను గెలిపించాలని పిలుపునిచ్చారు. అయితే, ఇక్కడ బండల మీద కట్టుకున్న ఇళ్ళకు టాయిలెట్లు కట్టించాలని, అలాగే రిజర్వ్ ఫారెస్ట్ లో ఉన్న మల్లన్న గుడికి దారి ఇప్పించాలని స్థానిక ప్రజలు ఈటెలకు విజ్ఞప్తి చేసుకున్నారు. వీటిపై ఎంపి ఈటెల స్పందిస్తూ, ఖచ్చితంగా మల్లన్న పండుగ జరుపుకోవడానికి దారి అనుమతి ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. నో అనేది నా డిక్షనరీలోనే లేదనీ, నేను మొదటి సారి ఎమ్మెల్యే అయినప్పుడు నాలుగు వందల ఓట్లు ఉన్న గ్రామానికి రెండు కోట్లు పెట్టి బ్రిడ్జి వేయించిన విషయాన్ని గుర్తుచేశారు. అలాగే, హుజురా బాద్ లో అలాంటివి 22 బ్రిడ్జులు కట్టించినానని వెల్లడించారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన మేరకు ప్రజలకు పింఛన్లు పెంచి, కొత్తవి ఇచ్చి ఓటు అడగాలని ఆయన లక్ష్మాపూర్ నుంచి సీఎం రేవంత్ రెడ్డిను డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ ఇక్కడే వాక్సిన్ తయారు చేయించి దేశానికి అందించారని ఈటెల అభినందించారు. బి.ఆర్.ఎస్ మల్లారెడ్డి డబ్బును నమ్ముకున్నాడనీ , మీము మాత్రం మిమ్మల్ని నమ్ముకున్నామన్నారు. ధర్మానికి ఓటు వేయాలని కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో ఈటెల రాజేందర్ తో పాటు బీజేపీ జిల్లా ఆదేశాలు బుద్ధి శ్రీనివాస్, మేడ్చల్ నియోజక వర్గం బిజెపి కంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం : బీఆర్ఎస్




**వైరా, నేడు న్యూస్ :** ఎన్నికల ముందు ప్రజలను మభ్యపెట్టి 420 హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా సమర్థవంతంగా అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల నమ్మకాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు మండిపడుతున్నారని వారు పేర్కొన్నారు. ఈ ప్రజా వ్యతిరేక పాలనకు నిరసనగా వైరా మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన యాత్రకు ప్రజల నుంచి ఊహించని స్థాయిలో స్పందన లభించింది. గ్రామాలు, వార్డుల గుండా సాగిన ఈ యాత్రలో కాంగ్రెస్ ప్రభుత్వ అసత్య హామీలు, విఫల పాలనను ప్రజలకు కళ్లకు కట్టినట్లు వివరించామని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా పక్కన పెట్టి, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. రైతులు, కార్మికులు, పేదలు తీవ్రంగా నష్టపోతున్నా పాలకులు పట్టించుకోకపోవడం కాంగ్రెస్ పాలన అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. అదేవిధంగా వైరా మున్సిపాలిటీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా అప్పం సురేష్‌ను నియమించినట్లు నాయకులు తెలిపారు. గతంలో ఈ బాధ్యతలు నిర్వహించిన మాజీ అధ్యక్షుడు రవి ప్రశాంత్ ఒకటో వార్డు నుంచి ఎస్సీ కోటాలో పోటీ చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారని పేర్కొన్నారు. అయినప్పటికీ పార్టీని మరింత బలోపేతం చేసి ప్రజా ఉద్యమాలను ముందుకు తీసుకెళ్లేందుకు అప్పం సురేష్‌కు ఈ బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ఇక మౌనం వహించబోమని, రానున్న రోజుల్లో ప్రజల తరఫున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని, కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజా క్షేత్రంలో ఎండగడతామని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు.




## ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

- ప్రెస్ క్లబ్ అధ్యక్షుడిగా వేముల తిరుపతిరెడ్డి
- నూతన కమిటీని అభినందించిన పలువురు జర్నలిస్టులు



**ఉప్పల్, నేడు న్యూస్:** ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా వేముల తిరుపతిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం ఉప్పల్ ప్రెస్ క్లబ్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉప్పల్ ప్రెస్ క్లబ్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్షుడుగా వేముల తిరుపతిరెడ్డి ఎన్నిక కాగా, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పి. సాగర్, ప్రధాన కార్యదర్శిగా గ్యారంపల్లి శివాజీ, ఉపాధ్యక్షులుగా ఏ.వి. శ్రీధర్ రావు, కూకట్ల నరోత్తమ్ రెడ్డి, కోశాధికారిగా గుత్తి శేఖర్, సంయుక్త కార్యదర్శిగా దాస రాజు, ముఖ్య సలహాదారులుగా కొలనుపాక చంద్రమౌళి, దొంతుల వెంకటరామ్ రెడ్డి, పల్లా మహేందర్ రెడ్డి, కంచు శ్రీనివాస్, కొడికంటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎన్నికల అధికారులుగా అడ్ హక్ కమిటీ సభ్యులైన వెంకట్రాంరెడ్డి, చంద్రమౌళి, మహేందర్ రెడ్డిలు వ్యవహరించారు. అనంతరం మాజీ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. కొత్తగా ఎన్నికైన కమిటీ 2 సంవత్సరాల వరకు కొనసాగుతుందని తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం వేముల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. జర్నలిజం విలువలు కాపాడటం, పాత్రికేయుల హక్కుల పరిరక్షణ కోసం పాటుపడతానని, అలాగే ప్రెస్ క్లబ్ సభ్యుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలోని జర్నలిస్టులను ఒకే వేదికపై ఏకతాటిపైకి తీసుకువచ్చి, వారి సంక్షేమానికి కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. ప్రెస్ క్లబ్ ద్వారా సామాజిక బాధ్యత కార్యక్రమాలు చేపట్టడం, యువ జర్నలిస్టులకు మార్గనిర్దేశం చేయడం, అలాగే ప్రభుత్వ అధికారులతో సమన్వయం పెంచడం తమ కార్యాచరణలో భాగమని తిరుపతిరెడ్డి వివరించారు. పత్రికా స్వేచ్ఛ పరిరక్షణకు కట్టుబడి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు.

## పులి సంచారం కలకలం



**దేవరుప్పుల నేడు న్యూస్:** దేవరుప్పుల మండలంలోని నీర్మల గ్రామంలో పులి సంచరిస్తుందన్న వార్తతో గ్రామంలో ఒక్కసారిగా భయాందోళన నెలకొంది. నీర్మల గ్రామం మీదుగా సంచరించి కుందారం గ్రామం మీదుగా రఘునాథ్ పల్లి వైపు పులి సంచరిస్తున్నట్టు అడవి శాఖ అధికారులు గుర్తించగా, వ్యవసాయ భూమిలో పులి ఆడవాళ్ళ అడుగుల ముద్రలు కనిపించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఈ ఘటనతో ఆ ప్రాంతాలలో వ్యవసాయ పనుల కోసం వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. రైతులు ఒంటరిగా కాకుండా ఇద్దరు లేక ముగ్గురు కలిసి వ్యవసాయ పనులకు వెళ్లాలని దేవరుప్పుల ఎస్సై సృజన్ కుమార్ సూచించారు. అనుమానస్పద కదలికలు కనిపిస్తే వెంటనే అటవీశాఖకు సమాచారం ఇవ్వాలని అధికారులు తెలిపారు.



## నోరు జారొద్దు.. అవసరమైతే ట్రంప్
# పదవీకాలం ముగిసేవరకు చూస్తాం
### తేల్చిచెప్పిన భారత్

**న్యూఢిల్లీ :** అమెరికా– భారత్‌ల మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, ఈ ఒప్పందానికి కొన్ని నెలల ముందు ఇరుదేశాలకు చెందిన నాయకుల మధ్య జరిగిన కీలక సమావేశానికి సంబంధించిన విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. ట్రేడ్ డీల్ కోసం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి చూస్తామని నాడు భారత్ తేల్చిచెప్పినట్లు తెలుస్తోంది. ఈ మేరకు బ్లూమ్‌బర్గ్ తన కథనంలో పేర్కొంది. ప్రస్తుతం ఇది చర్చనీయాంశంగా మారింది. కథనం ప్రకారం.. సెప్టెంబరు ప్రారంభంలో భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియోల మధ్య సమావేశం జరిగింది. ఆ సమయంలో భారత ప్రభుత్వంపై, ప్రధాని మోదీపై ట్రంప్, ఆయన వాణిజ్య సలహాదారు పీటర్ నవారో సహా పలువురు అధికారులు నోరు పారేసుకోవడం, టారిఫ్‌ల విషయంలో పలుమార్లు బెదిరింపులకు పాల్పడిన విషయం కూడా తెలిసిందే. నాడు జరిగిన భేటీలో భారత్ తన వైఖరిని స్పష్టంగా తెలియజేసింది. 'ట్రంప్, ఆయన పరిపాలనాధికారుల బెదిరింపులకు భారత్ తలొగ్గదు. ట్రేడ్ డీల్ కోసం ట్రంప్ పదవీకాలం ముగిసేవరకు వేచి ఉండటానికి కూడా సిద్ధంగా ఉన్నాం' అని డోభాల్ రూబియోతో చెప్పినట్లు బ్లూమ్‌బర్గ్ పేర్కొంది. దీంతోపాటు భారత్‌పై బహిరంగ విమర్శలు తగ్గిస్తే ఇరుదేశాల మధ్య సంబంధాలు మళ్లీ గాడిలోకి వస్తాయని డోభాల్ స్పష్టం చేశారు. ఈ సమావేశం జరిగిన కొన్ని రోజులకే ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గినట్లు తెలుస్తోంది. ఆ తర్వాత ప్రధాని మోదీకి ట్రంప్ పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పారు. ఆ సమయంలో ప్రధానిపై అమెరికా అధ్యక్షుడు ప్రశంసలు కురిపించారు. ఈ సమావేశం గురించి అమెరికా విదేశాంగ ప్రతినిధి మాట్లాడుతూ.. ప్రైవేటు చర్చల వివరాలు బయటకు వెల్లడించలేమన్నారు. ఇక, భారత్ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు.



## నైజీరియాలో ఘోరం..
### 200 మంది ఊచకోత

**నైజీరియా :** నైజీరియాలో సాయుధమూక నరమేధం సృష్టించింది. రెండు గ్రామాల్లోని ప్రజలపై దాడులు చేసి.. 200 మందిని అతి దారుణంగా చంపేశారు. పలు ఇళ్లు, దుకాణాలను కూడా తగలబెట్టారు. క్వారా రాష్ట్రంలోని వోరో, నూక అనే రెండు గ్రామాల్లో ఈ దాడులు జరిగాయి. వోరో స్థానిక నాయకుడు సైదు బాబాఅహ్మద్ మాట్లాడుతూ.. ప్రజలను చుట్టుముట్టి, వారి చేతులను వెనక్కి కట్టి ఆ తర్వాత కాల్చి చంపేశారని తెలిపారు. దాడి సమయంలో కొంతమంది ప్రజలు ప్రాణభయంతో పరుగులు తీశారని.. ప్రస్తుతం వారి ఆచూకీ తెలియడం లేదని వెల్లడించారు. తాజా ఘటనకు సంబంధించి స్థానిక మీడియాలో వీడియోలు ప్రసారమయ్యాయి. అందులో వీధుల్లో పెద్దఎత్తున మృతదేహాలు పడి ఉన్నట్లు కన్పించాయి. ఈ దృశ్యాలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. అమ్నెస్టీ ఇంటర్నేషనల్ మానవ హక్కుల సంఘం ఈ ఘటనను తీవ్రంగా ఖండించింది. దుండగులు దాదాపు ఐదు నెలల నుంచి గ్రామస్థులకు హెచ్చరిక లేఖలు పంపుతున్నారని.. అయినా భద్రతాపరమైన చర్యలు తీసుకోలేదని మండిపడింది. ఇటీవల నైజీరియా సైన్యం ఉగ్రవాదులకు వ్యతిరేకంగా ఈ ప్రాంతంలో ఆపరేషన్లు నిర్వహించి 150 మందిని మట్టుబెట్టింది. ఈ సైనిక చర్యకు ప్రతిస్పందనగానే తాజా దాడులు జరిగాయని క్వారా గవర్నర్ అబ్దుల్ రెహమాన్ పేర్కొన్నారు. దీన్ని పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇదిలాఉండగా.. కాట్సినా రాష్ట్రంలో కూడా దుండగులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 21 మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక పోలీసులు తెలిపారు.

## 'హనీమూన్ హత్య' తరహా ఘటన..
### భర్తను వాకింగ్‌కు తీసుకెళ్లి..



**రాజస్థాన్ :** పెళ్లయిన మూడు నెలలకే భర్తను హత్య చేయించిందో యువతి. వాకింగ్‌కు వెళ్దామని తీసుకెళ్లి.. ప్రియుడితో కొట్టి చంపించింది. ఆపై రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసింది. మేఘాలయ 'హనీమూన్ హత్య'ను గుర్తు చేస్తున్న ఈ దారుణ ఘటన రాజస్థాన్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌కు చెందిన ఆశిష్‌కు మూడు నెలల కిందట అదే ప్రాంతానికి చెందిన అంజూతో వివాహమైంది. అయితే, కొన్ని రోజులకే వీరి మధ్య మనస్పర్థలు రావడంతో అంజూ పుట్టింటికి వెళ్లిపోయింది. ఆ తర్వాత పెద్దల సమక్షంలో సమస్య పరిష్కారమవడంతో మళ్లీ అత్తింటికి చేరుకుంది. జనవరి 30న రాత్రి 9 గంటల సమయంలో వీరిద్దరూ రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళ్తున్న కొందరు స్థానిక ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆశిష్ ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని దర్యాప్తు చేపట్టారు. గుర్తుతెలియని వాహనం తమను ఢీకొట్టిందని, ఆ తర్వాత అందులో నుంచి కొందరు వ్యక్తులు దిగి తనను బెదిరించి నగలు దోచుకెళ్లినట్లు అంజూ విచారణలో పేర్కొంది. అయితే, ఆమె చెప్పిన సమాధానానికి, ఘటనా స్థలంలోని పరిస్థితులకు పొంతన లేకపోవడంతో పోలీసులకు అనుమానం వచ్చింది. అంతేగాక, అంజూకు ఎలాంటి గాయాలు కాకపోవడం, ఆశిష్ ఒంటిపై గాయాలు ఉండటంతో పోలీసులు ఆమెను గట్టిగా విచారించారు. దీంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది.

## ఎన్నికలకు ముందు
# 'ఉచిత' హామీలపై పిల్
### విచారణకు సుప్రీం అంగీకారం



**న్యూఢిల్లీ :** ఎన్నికల్లో ఓటర్లను ఆకర్షించేందుకు రాజకీయ పార్టీలు ఎక్కువగా ఉచితాల వైపే దృష్టిసారిస్తాయి. ఈ ఉచిత హామీలకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో పిల్ దాఖలైంది. తాజాగా దాన్ని విచారించేందుకు అత్యున్నత న్యాయస్థానం అంగీకరించింది. న్యాయవాది అశ్విని ఉపాధ్యాయ ఈ పిల్‌ను దాఖలు చేశారు. అందులో ఎన్నికలకు ముందు అసంబద్ధమైన 'ఉచిత' హామీలు ఇచ్చే రాజకీయ పార్టీల గుర్తులు, వాటి రిజిస్ట్రేషన్‌లను రద్దు చేయాలని ఆయన కోరారు. తన పిల్‌పై 2022లోనే కేంద్రం, ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ అయ్యాయని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం దృష్టికి పిటిషనర్ తీసుకెళ్లారు. దీనిపై త్వరగా విచారణ జరపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఆచరణ సాధ్యం కాని వాగ్దానాలు ఓటర్లను ప్రభావి తం చేస్తాయని.. ఇది ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను దెబ్బతీస్తుం దని ఆయన పేర్కొన్నారు. ఈ విషయంలో ఓ చట్టాన్ని రూపొందించేలా కేంద్రాన్ని ఆదేశించాలని న్యాయస్థానాన్ని కోరా రు. ధర్మాసనం దీన్ని తీవ్రమైన సమస్యగా పేర్కొంటూ.. దీనిపై మార్చి చివరిలో విచారణ జరిపేందుకు అంగీకరించింది.

## అంతరిక్షంలో డేటా సెంటర్లు..
# 10లక్షల ఉపగ్రహాలు
### ఎలాన్ మస్క్ కొత్త ప్లాన్



**యూఎస్ :** ప్రపంచ అపర కుబేరుడు, టెస్లా, స్పేస్‌ఎక్స్ సంస్థల అధినేత ఎలాన్ మస్క్ తన వ్యాపార సామ్రాజ్యాన్ని మరింత విస్తరించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకోసం కొత్త ప్రణాళికలను ప్రకటించారు. అంతరిక్షంలో డేటా సెంటర్లు ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు తెలిపారు. ఇక, కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలను పంపడమే తన లక్ష్యమని మస్క్ వెల్లడించారు. ఈ ప్రణాళికలకు ఆర్థిక సహకారం కోసం ఇటీవల స్పేస్‌ఎక్స్ సంస్థలో తన ఏఐ వ్యాపారాన్ని విలీనం చేశారు. ఈ రెండింటితో కలిసి ఏర్పాటైన సంస్థ త్వరలోనే ఐపీఓకు వెళ్లనున్నట్లు ప్రకటించారు. "ప్రస్తుతం అందుబాటులో ఉన్న కృత్రిమ మేధ వ్యవస్థలకు పెద్ద మొత్తంలో విద్యుత్, కూలింగ్ సిస్టమ్స్ అవసరం. ఇవి భూమిపైన పెద్ద సంఖ్యలో డేటా సెంటర్లపై ఆధారపడి పని చేస్తున్నాయి. భవిష్యత్తులో ఏఐ వినియోగం మరింత పెరిగిన తర్వాత ఈ డేటా సెంటర్లు సరిపోవు. సుదీర్ఘకాలంలో దీనికి అంతరిక్ష ఆధారిత ఏఐ ఒక్కటే పరిష్కారం. అందుకే అంతరిక్షంలో డేటా సెంటర్లను ఏర్పాటుచేయాలనుకుంటున్నా. సౌరశక్తితో వాటికి విద్యుత్ సరఫరా అందించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నా. ఇక, అంతరిక్ష ఆధారిత డేటా సెంటర్లకు పెద్దసంఖ్యలో శాటిలైట్లు అవసరం. అందుకే కక్ష్యలోకి 10 లక్షల ఉపగ్రహాలు పంపిస్తాం" అని మస్క్ వివరించారు. అయితే, మస్క్ ప్రణాళికలకు సాంకేతికంగా, ఆర్థికంగా సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు, పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చాట్‌బాట్లు, ఇతర ఏఐ టూల్స్‌ను నిర్వహించడం కోసం అంతరిక్షం నుంచి సౌరశక్తిని తీసుకోవడం వల్ల పవర్‌గ్రిడ్‌లపై ఒత్తిడికి తగ్గినప్పటికీ.. ఇందుకు కొన్ని సమస్యలు లేకపోలేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. డేటా సెంటర్లు పెద్ద మొత్తంలో వేడిని ఉత్పత్తి చేస్తాయని, దీంతో భూమ్మీదతో పోలిస్తే అంతరిక్షంలో కంప్యూటర్ చిప్‌లు మరింత వేగంగా ఓవర్‌హీట్ అవుతాయని హెచ్చరిస్తున్నారు. ఇక, ఉపగ్రహాల సంఖ్య పెరిగితే మరో సమస్య ఎదురవుతుందని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కక్ష్యలో ఏదైనా ఉపగ్రహం విఫలమైతే అది ఇతర శాటిలైట్లను ఢీకొట్టే ప్రమాదం ఉంటుంది. ఇప్పటికే స్టార్‌లింక్‌కు చెందిన దాదాపు 10వేల ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయి. ఇప్పుడు 10లక్షల శాటిలైట్లు ప్రయోగిస్తే.. అప్పుడు ప్రమాదాలు జరిగే అవకాశం మరింత ఎక్కువగా ఉంటుందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు.

## 40 ఏళ్ల తర్వాత న్యాయం: నిర్దోషిగా 100 ఏళ్ల వృద్ధుడు

**అలహాబాద్ :** దశాబ్దాల నిరీక్షణ తర్వాత 100 ఏళ్ల వృద్ధుడికి న్యాయం దక్కింది. 40 ఏళ్ల తర్వాత హత్య కేసులో అతడిని నిర్దోషిగా తేలుస్తూ అలహాబాద్ హైకోర్టు తాజాగా తీర్పునిచ్చింది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. ఓ భూవివాదం కాస్తా తీవ్రరూపం దాల్చి, ఒకరి హత్యకు దారితీసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో 1982లో జరిగిన ఈ హత్య ఘటనలో మైకు ప్రధాన నిందితుడు కాగా.. ధనీరామ్, సత్తిదిన్ హత్యకు ప్రేరేపించారని అభియోగాలు నమోదయ్యాయి. ఈ కేసును విచారించిన హమీర్‌పుర్ సెషన్స్‌కోర్టు 1984లో ధనీరామ్, సత్తిదిన్‌కు జీవితఖైదు విధించింది. మైకు మాత్రం అరెస్టు కాలేదు. సెషన్స్ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ.. ఆ ఇద్దరు 40 ఏళ్ల క్రితం అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. అప్పటి నుంచి ఆ పిటిషన్ పెండింగ్‌లోనే ఉండిపోయింది. అది విచారణ దశలో ఉండటంతో బెయిల్‌కు దరఖాస్తు చేసుకోగా.. మంజూరైంది. ఈ కేసు ఎటూ తేలకుండానే కొన్నేళ్లక్రితం సత్తిదిన్ మృతి చెందాడు. ఈ హత్య కేసు తాజాగా హైకోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మైకుని అరెస్టు చేయకపోవడాన్ని కోర్టు ప్రస్తావించింది. ధనీరామ్ అప్పీల్‌పై నిర్ణయంలో అసాధారణ జాప్యం, ప్రాసిక్యూషన్‌లో లోపాలను ఎత్తిచూపిన న్యాయస్థానం.. తాజాగా తీర్పునిచ్చింది. అలాగే అతడి వయసును పరిగణనలోకి తీసుకొని నిర్దోషిగా తేల్చింది.

# నేను పశ్చాత్తాపం వ్యక్తం చేస్తున్నా..
### ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్



**ఆస్ట్రేలియా :** ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ వ్యవహారంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడయ్యాయి. దీనిపై తాజాగా గేట్స్ స్పందించారు. అతడితో ఉన్న ప్రతీ క్షణానికి చింతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియా సంస్థతో మాట్లాడారు. "ఎప్‌స్టీన్ కోసం కేటాయించిన ప్రతీ క్షణానికి ఇప్పుడు నేను చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. అయితే ఆ ఈ–మెయిల్‌లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదోఒక రూపంలో అతడు నన్ను టార్గెట్ చేయా లని ప్రయత్నించాడా..?" అని వ్యాఖ్యలు చేశారు. ఆ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీలను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సం గతి తెలిసిందే. ఇందులో గేట్స్‌కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారినపడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు. 2013లో తనకి తాను రాసుకున్న ఈ–మెయిల్‌లో అతడు ఈ విషయాలు ప్రస్తావించాడు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన మిలిందా (గేట్స్ మాజీ భార్య)కు రహస్యంగా ఇచ్చేందు కు యాంటీబయాటిక్స్‌ను అడిగారని రాసుకొచ్చాడు. ఆ పరిణామాల తర్వాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచు కున్నాడని ఎప్‌స్టీన్ వెల్లడించాడు. అయితే ఈ–మెయిల్‌లోని అంశాలను గేట్స్ బృందం ఖండించింది. ఇదిలాఉంటే.. ఈ ఫైళ్ల విడుదల తర్వాత మిలిందా స్పందించిన సంగతి తెలిసిం దే. "నా వివాహంలో ఎంతో బాధించే కొన్ని విషయాలు ఉన్నాయి. ఇప్పుడు బయటకు వచ్చిన వాటిపై సమాధానం ఇవ్వా ల్సింది బిల్‌గేట్స్.. నేను కాదు. బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు. మూడు దశాబ్దాల వివాహ బంధానికి స్వస్తి పలుకుతూ బిల్‌గేట్స్ – మిలిందా దంపతులు 2021లో విడాకులు తీసుకున్నారు. ఎప్‌స్టీన్‌తో గేట్స్‌కు సంబంధాలు ఉండడం నచ్చని మిలిందా ఆయన నుంచి విడాకులు తీసుకున్నారని అప్పట్లో వార్తలు వచ్చాయి.



## 10 రోజుల ముందే
## సోషల్ మీడియా ఖాతాలు డిలీట్
### అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య కేసులో మరిన్ని వివరాలు

**గాజియాబాద్ :** ఉత్తరప్రదేశ్‌లోని గాజియాబాద్‌లో ముగ్గురు అక్కాచెల్లెళ్లు ఆత్మహత్య చేసుకున్న ఘటన సంచలనం సృష్టిస్తోంది. ఆన్‌లైన్ గేమ్ ఆడొద్దన్నందుకు మనస్తాపానికి గురై నిషిక (16), ప్రాచీ (14), పఖీ (12) బుధవారం ఉదయం బలవన్మరణానికి పాల్పడిన సంగతి తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. వీరు సోషల్ మీడియాలో కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచినట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. ఆత్మహత్యకు 10 రోజుల ముందే వారి సోషల్ అకౌంట్లను బాలికల తండ్రి డిలీట్ చేసినట్లు తెలిసింది. ఈ ముగ్గురు బాలికలు సోషల్ మీడియాలో మరియా, అలీజా, సిండీ అనే కొరియన్ పేర్లతో ఖాతాలు తెరిచారు. ఇంట్లో కూడా వీరు అదే పేర్లతో పిలుచుకునేవారట. 10 రోజుల క్రితం ఈ అకౌంట్ల గురించి తండ్రి చేతన్‌కుమార్‌కు తెలియడంతో ఆ ఖాతాలను డిలీట్ చేశారు. బాలికల వద్ద నుంచి మొబైల్ ఫోన్లను కూడా లాగేసుకున్నారని దర్యాప్తులో పోలీసులు గుర్తించారు. ఇక, చేతన్‌కు రూ.2 కోట్ల వరకు అప్పులున్నాయి. దీంతో ఇంటి అవసరాల కోసం అమ్మాయిల ఫోన్లను ఆయన విక్రయించినట్లు పోలీసులు వెల్లడించారు. అంతేగాక, ఇలాగే ఉంటే పెళ్లి చేస్తానని చేతన్ తన కుమార్తెలను హెచ్చరించినట్లు తెలిపారు. తండ్రి తమ సోషల్‌మీడియా ఖాతాలను డిలీట్ చేయడం, ఫోన్లు లేకపోవడంతో గేమ్‌లు, కె–డ్రామా సిరీస్‌లు చూడలేకపోవడంతో ఆ ముగ్గురు అమ్మాయిలు తీవ్ర మనస్తాపానికి లోనయ్యారు. దీని గురించి తమ డైరీలో రాసుకున్నట్లు పోలీసులు తెలిపారు. "కొరియానే మా ప్రాణం. ఈ విషయం మీకు ఎప్పటికీ అర్థం కాదు. మేం ఇక్కడివాళ్లను పెళ్లి చేసుకోలేం" అని వారు ఆ డైరీలో రాసినట్లు పేర్కొన్నారు. గత రెండేళ్ల నుంచి ఈ అమ్మాయిలు స్కూల్‌కు వెళ్లట్లేదని పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యులు వారిని స్కూల్‌కు పంపించే ప్రయత్నం చేయకపోవడం గమనార్హం. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.



## వాషింగ్టన్ పోస్ట్ లేఆఫ్‌లు..
### ఉద్యోగం కోల్పోయిన శశిథరూర్ కుమారుడు ఇషాన్

**న్యూఢిల్లీ :** కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్ ఉద్యోగం కోల్పోయారు. తాజాగా వాషింగ్టన్ పోస్ట్ పత్రిక లేఆఫ్ ఇచ్చిన వారిలో ఆయన కూడా ఉన్నారు. వ్యయభారాన్ని తగ్గించుకునేందుకు చేపట్టిన పునర్వ్యవస్థీకరణ చర్యల్లో భాగంగా.. మొత్తం ఉద్యోగాల్లో మూడో వంతు సిబ్బందికి ఈ సంస్థ కోత పెట్టింది. సీనియర్ ఇంటర్నేషనల్ అఫైర్స్ కాలమిస్ట్‌గా పనిచేసిన ఇషాన్.. ఈ లేఆఫ్‌లపై ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. "వాషింగ్టన్ పోస్ట్ లేఆఫ్‌లలో నాతో పాటు అంతర్జాతీయ వ్యవహారాలు చూసే పలువురు సిబ్బంది ఉద్యోగాలు కోల్పోయారు. 12 ఏళ్లుగా నేను ఈ సంస్థలోనే పని చేస్తున్నాను. ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులతో కలిసి పనిచేశాను. ఇప్పుడు ఈ పరిణామం తీవ్రంగా బాధిస్తోంది" అని రాసుకొచ్చారు. ప్రపంచ వ్యవహారాలను అందులో అమెరికా పాత్రను పాఠకులు సమగ్రంగా అర్థం చేసుకునే లక్ష్యంతో 2017లో వరల్డ్ వ్యూ కాలమ్‌ను ఆవిష్కరించిన అంశాన్ని గుర్తుచేసుకున్నారు. దానిని ఆదరించిన సబ్‌స్క్రైబర్లకు కృతజ్ఞతలు తెలియజేశారు. న్యూస్‌రూమ్‌ను, వాషింగ్టన్ పోస్ట్ నినాదం ఉన్న పోస్టర్‌ను షేర్ చేశారు. దానికి ఇదొక చెడ్డరోజు అనే వ్యాఖ్యను జోడించారు. ఫారిన్ బ్యూరోలు, స్థానిక రిపోర్టింగ్ బృందాలు, స్పోర్ట్స్ డెస్క్, బిజినెస్ విభాగంలోని ఉద్యోగాలపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది. దీంతో దాని అంతర్జాతీయ కవరేజ్‌పై ప్రభావం పడనుంది. ఈ వార్తా పత్రికను స్టిల్సన్ హచిన్స్ స్థాపించారు. 2013లో అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ దీనిని సొంతం చేసుకున్నారు.

## ఆర్గానికి నెయ్యి పేరుతో బురిడీ కొట్టించారు
### తిరుమల కల్తీపై మరోమారు మంత్రి పయ్యావుల విమర్శలు

**అమరావతి, ఫిబ్రవరి 5 :** శ్రీవారి లడ్డూ కల్తీ విషయంలో అనుమానాలపై వాస్తవాలు చెబుతున్నామని ఏపీ ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. వేంకటేశ్వర స్వామి లడ్డూ గట్టిగా ఉందని, సువాసన లేదని భక్తులు గతంలో తమకు ఫిర్యాదు చేశారని తెలిపారు. అప్పటి ఈవో ధర్మారెడ్డికి పోటు కార్మికులు చెపితే.. ఆర్గానిక్ నెయ్యి అలానే ఉంటుందని చెప్పారని ప్రస్తావించారు. ఈవో తన విధి నిర్వహణలో భాగంగా శాంపిల్స్ పంపారని గుర్తు చేశారు. రిపోర్టుతో అందరు నివ్వెరపోయారన్నారు. కల్తీ జరిగినట్లుగా నివేదిక వచ్చిందని పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన అమరాతి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఆ విషయాలను ప్రజల ముందు పెట్టారని, నాటి రిపోర్టును వివరించారని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 'ఈ కల్తీ వ్యవహారాన్ని తేల్చడానికి సిట్‌ను ఏర్పాటు చేశాం. దీనిలో మరో ఇద్దరు అధికారులను యాడ్ చేసి సీబీఐ ఆధ్వర్యంలో దర్యాప్తు చేయాలని నిర్ణయించారు. టీటీడీలో ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా చూడాలన్నారు. ప్రతి ఒక్కటీ తెలిసే జరిగింది. తెలియక కాదు... సీఎఫ్టీఆర్ఐ కూడా మరో నివేదిక ఇచ్చింది. బెటాసిస్టోస్టిరాయ్ దీనిలో ఉన్నట్లు పేర్కొంది. ఇంత తెలిసిన తర్వాత కూడా టీటీడీ మాజీ చైర్మన్ ఈ విషయాన్ని తొక్కిపెట్టారు. 60 లక్షల లీటర్లు కల్తీ నెయ్యి సరఫరా చేశారు, రూ.234 కోట్లు దుర్వినియోగమైంది' అని మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు. చిన్న అప్పన్న బోలేబాబా డెయిరీ దగ్గరకు వెళ్లి ఈ టెండర్ ఇవ్వాలని కోరారని.. వారు అంగీకరించలేదని మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. 'వారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టారు. తర్వాత కూడా వారి సంస్థను తీసుకోవడం కుదరదని.. ఏఆర్ డెయిరీ, వైష్ణవి డెయిరీల ద్వారా సరఫరా చేయించారు. కిలోకు రూ.35లు నష్టానికి వారు సరఫరా చేశారు. ఇది వారికి ఎలా సాధ్య మైందో ఆలోచించాలి. రూ.320లకు నెయ్యి ఎలా ఇచ్చారు... బోలే బాబా అనే సంస్థ నెయ్యి అని పిలువబడే నెయ్యిని తయారు చేశారు. ఫామాయిల్, పామ్ కెర్నల్ ఆయిల్‌ను నెయ్యి వాసన వచ్చేలా, రంగువచ్చేలా తయారు చేశారు. బోలేబాబాలో పదిమంది ఉద్యోగులు మాత్రమే ఉన్నారు. వీరిలో స్వీపర్లు, వాచ్‌మెన్‌లు కాకుండా ఆరుగురు ఉన్నారని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

# ఒక్క రోజే రూ.30వేలు తగ్గిన వెండి ధర

## కాస్త దిగొచ్చిన పసిడి

దేశీయ విపణిలో బంగారం, వెండి ధరలు గురువారం దిగొచ్చాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 24 క్యారెట్ల మేలిమి బంగారం 10 గ్రాముల ధర రూ.6,600 తగ్గి రూ.1,59,680 పలికింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,41,550గా ఉంది. ఇక, వెండి ధర భారీగా పడిపోయింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.30వేల మేర తగ్గింది. నేటి మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,69,000గా ఉంది. అంతర్జాతీయం గానూ ఈ లోహాల ధరలు కాస్త తగ్గుముఖం పట్టాయి. ఔన్సు పుత్తడి ధర 4,919 డాలర్లు, ఔన్సు వెండి ధర 79 డాలర్లుగా కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో మార్చి డెలివరీ కాంట్రాక్టుకు వెండి దాదాపు 7శాతం కుంగి కిలో ధర రూ.2.49 లక్షల వద్ద ఉంది. ఏప్రిల్ డెలివరీలకు పసిడి ధర స్వల్పంగా పెరిగి 10 గ్రాముల ధర రూ.1.53 లక్షలకు చేరింది.










## నష్టాల్లో ముగిసిన సూచీలు

**ముంబాయి :** దేశీయ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లోని ప్రతికూల సంకేతాలు, లోహరంగ షేర్లలో అమ్మకాల ఒత్తిడితో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. సెన్సెక్స్ 500 పాయింట్లు నష్టపోయి, 83,313 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 132 పాయింట్లు కుంగి, 25,642 వద్ద ముగిసింది. నేటి ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 83,757 వద్ద (క్రితం ముగింపు 83,817 ) ప్రారంభమైంది. ఒక దశలో 83,784 వద్ద గరిష్ఠాన్ని తాకింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 90.33గా ఉంది. నిఫ్టీ సూచీలో ట్రెంట్, మ్యాక్స్ హెల్త్‌కేర్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ షేర్లు రాణించాయి. హిందాల్కో, ఎటర్నల్, భారతీ ఎయిర్‌టెల్, భారత్ ఎలక్ట్రానిక్స్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ స్టాక్స్ నష్టాలను చవిచూశాయి. నేటి ట్రేడింగ్‌లో నష్టాలకు ప్రధాన కారణం లోహరంగ షేర్లు. అవి రెండు శాతం మేర కుంగాయి. డాలర్ బలపడటంతో కమోడిటీ ధరలు పెరగడం, గత మూడు సెషన్లలో దూసుకెళ్లిన మెటల్ ఇండెక్స్‌లో కరెక్షన్ చోటుచేసుకోవడం నష్టాలకు కారణం. మరోవైపు, ఆసియా మార్కెట్లలోని దక్షిణకొరియా కొస్పి మూడుశాతం పతనమైంది. జపాన్ నిక్కీ, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. బుధవారం సాయంత్రం అమెరికా మార్కెట్లు నష్టాల్లోనే ముగిశాయి.



### క్రికెట్ అభివృద్ధికి ఐసీసీ ఛైర్మన్

## జైషా కృషి అభినందనీయం

### ఫిఫా అధ్యక్షుడు జియా ఇన్ఫాంటినో

క్రికెట్ అభివృద్ధికి ఐసీసీ ఛైర్మన్ జైషా అద్భుతమైన కృషి చేస్తున్నారని ఫిఫా అధ్యక్షుడు జియా ఇన్ఫాంటినో కొనియాడారు. ఆయన మిలన్‌లో జైషాను కలిశారు. తాజాగా ఇన్ఫాంటినో ఆ చిత్రాన్ని తన ఇన్‌స్టా ఖాతాలో పంచుకున్నాడు. 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో , క్రికెట్ ఉండబోతున్న నేపథ్యంలో ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. 'ఐసీసీ ఛైర్మన్ జైషాను ఈ రోజు కలవడం నాకు ఆనందంగా ఉంది. క్రికెట్‌ను అభివృద్ధి చేయడంలో ఆయన చేసిన అద్భుతమైన కృషి ఆదర్శప్రాయం. ఒలింపిక్ క్రీడల్లోకి క్రికెట్ తిరిగి చేరుతున్నందుకు ఆయనకు, అందరికీ శుభాకాంక్షలు. క్రీడలతో ప్రపంచాన్ని ఏకం చేస్తున్నప్పుడు పరస్పర సహకారాలతో కలిసి పనిచేయడానికి నేను ఎదురుచూస్తున్నా' అని ఇన్ఫాంటినో పేర్కొన్నారు. గతంలో చివరిసారిగా పారిస్ ఒలింపిక్స్ 1900లో క్రికెట్ ఆడారు. ఆనాడు ఫ్రాన్స్‌తో జరిగిన ఒకే ఒక్క మ్యాచ్‌లో గ్రేట్ బ్రిటన్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. మళ్లీ 128 సంవత్సరాల తర్వాత రెండోసారి క్రికెట్ ఒలింపిక్స్‌లో కనిపించనుంది. అయితే ఒలింపిక్ క్రీడలకు అర్హత సాధించే విధానం ఇంకా ఖరారు కాలేదు. జులైలో సింగపూర్‌లో నిర్వహించనున్న వార్షిక సమావేశంలో ఈ విషయమై చర్చించే అవకాశముంది.

# మేం భారత్‌తో ఆడబోం

### పాక్ ప్రధాని షెహబాజ్



**ఇస్లామాబాద్ :** టీ20 వరల్డ్ కప్ 2026లో పాకిస్థాన్, భారత్‌తో మ్యాచ్ ఆడదని పాక్ ప్రధాని షెహబాజ్ మరోసారి ధ్రువీకరించారు. ఇస్లామాబాద్‌లో మంత్రివర్గాన్ని ఉద్దేశిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'మేం టీ20 వరల్డ్ కప్‌లో భారత్‌తో మ్యాచ్ ఆడబోమనే విషయంలో చాలా క్లారిటీతో నిర్ణయం తీసుకున్నాం. క్రీడల్లో రాజకీయాలు ఉండకూడదు. మేం సరైన నిర్ణయమే తీసుకున్నాం' అని అన్నారు. కానీ తమ జట్టు భారత్‌తో ఆడకపోవడానికి గల కారణాలను ఆయన వెల్లడించలేదు. అయితే పాక్ నిర్ణయాన్ని ఐసీసీ ఇప్పటికే తప్పు పట్టింది. ఇది క్రీడాస్ఫూర్తికి విరుద్ధమంది. ఎంపిక చేసిన మ్యాచ్‌లు మాత్రమే ఆడతామనడం సమంజసం కాదంది. అయినా పాక్ తన పెంకితనం వీడటం లేదు. పొట్టి ప్రపంచకప్ షెడ్యూల్ ప్రకారం టీమ్‌ఇండియాతో పాక్ ఈనెల 15న కొలంబోలోని ప్రేమదాస స్టేడియం వేదికగా మ్యాచ్ ఆడాల్సిఉంది. భద్రత కారణాలను సాకుగా చూపుతూ తమ మ్యాచ్‌లను శ్రీలంకకు తరలించాలని బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డ్ ఐసీసీ మీద ఒత్తిడి తీసుకువచ్చింది. అయితే భారత్‌లో భద్రతపరంగా అంతా బాగానే ఉందని నిర్ధరణకు వచ్చిన ఐసీసీ అందుకు ఒప్పుకోలేదు. దీంతో బంగ్లాదేశ్ ప్రపంచకప్ నుంచి తప్పుకొంది. దాని స్థానంలో ఐసీసీ.. స్కాట్లాండ్‌కు అవకాశం కల్పించింది. బంగ్లాకు మద్దతుగా పాకిస్థాన్.. పొట్టి ప్రపంచకప్‌లో భారత్‌తో మ్యాచ్‌ను ఆడబోమని చెబుతోంది. అదే జరిగితే పాక్‌పై ఐసీసీ ఆంక్షలు విధించే అవకాశముంది. ఆర్థికంగానూ పాకిస్థాన్ తీవ్రంగా నష్టపోనుంది.

### 2027 వన్డే ప్రపంచకప్‌లో

# రోహిత్, కోహ్లి ఆడితే తప్పేంటి?

### మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని ఆసక్తికర వ్యాఖ్యలు






**న్యూఢిల్లీ : భారత స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మల భవిష్యత్తుపై దిగ్గజ క్రికెటర్, మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆటగాళ్ల వయసు కంటే ఫిట్‌నెస్, ప్రదర్శనే ప్రామాణికమని ధోని స్పష్టంచేశాడు. ప్రదర్శన బాగుంటే 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్, కోహ్లీలు ఆడటంలో తప్పేంటని ప్రశ్నించాడు.**

"నా వరకైతే వయసు కాదు.. ప్రదర్శన, ఫిట్‌నెస్‌లే ప్రామాణికం. ఎవరికీ ఏమీ చెప్పాల్సిన పనిలేదని నేనెప్పుడూ భావిస్తా. అయితే అందరినీ ఒకేలా చూస్తారన్న స్పష్టత ఉండాలి. నేను అరంగేట్రం చేసినప్పుడు నా వయసు 24 ఏళ్లు. అప్పుడు నాకు ఎవరూ ఏమీ చెప్పలేదు. ఇప్పుడు నేను 10 ఏళ్లుగా, 20 ఏళ్లుగా లేదా ఎంత కాలమైనా భారత్ తరఫున ఆడుతున్నప్పుడు ఎవరూ వచ్చి నా వయసు గురించి నాకు చెప్పాల్సిన అవసరం లేదు. రోహిత్, విరాట్ లేదా రాబోయే అయిదేళ్లలో వచ్చే ఇతర ఆటగాళ్లు తర్వాతి ప్రపంచకప్‌లో ఆడతారా? లేదా? అన్నది నిర్ణయించాల్సింది మనం కాదు. అది వారే నిర్ణయించుకోవాలి. వారి ప్రదర్శన బాగుంటే.. దేశం తరఫున బాగా చేయాలనే తపన వాళ్లలో ఉంటే ఆడటంలో తప్పేముంది. అనుభవజ్ఞులైన ఆటగాళ్లు దొరకరు. సచిన్‌లా 20 ఏళ్లకే అనుభవమున్న ఆటగాళ్లు లభించరు. 16-17 ఏళ్లప్పుడు ఆట మొదలుపెడితేనే అది సాధ్యం. ఆటగాడు కెరీర్‌లో సుదీర్ఘకాలం ఒత్తిడిని ఎదుర్కొని ఉంటే తప్ప అతడిని అనుభవజ్ఞుడిగా పరిగణించలేం. 20, 25 మ్యాచ్‌లు ఆడితే అనుభవంగా తీసుకోలేం. ఆ అనుభవం సంపాదించడానికి నేను 80, 85 మ్యాచ్‌లు ఆడాల్సివచ్చింది. ఆ తర్వాతే హృదయ స్పందనను ఎలా అదుపులో ఉంచుకోవాలో.. భావోద్వేగాల్ని ఎలా నియంత్రించుకోవాలో.. ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో తెలుసుకున్నా. కాబట్టి అనుభవం, యువ ఉత్సాహం కలిపి జట్టు ఉండటం చాలా ముఖ్యం. ఆటగాళ్లందరినీ సమానంగా చూడాలి. రాణించేవాళ్లు జట్టులో ఉంటారు. లేకపోతే చోటు దక్కదు. కాబట్టి జట్టు ఎంపికలో ఏ ఒక్క వ్యక్తి గురించి ప్రశ్నలు తలెత్తకూడదు. ఆటగాడు రాణిస్తున్నాడు.. ఫిట్‌నెస్‌గా ఉన్నాడు అంటే ఆడుతూనే ఉంటాడు. అదొక్కటే ప్రామాణికం కావాలి. టీ20 ప్రపంచకప్‌లో అత్యంత ప్రమాదకర జట్లలో భారత్ ఒకటి. మంచి జట్టుకు అవసరమైనవన్నీ ఈ బృందంలో ఉన్నాయి. ఈ ఫార్మాట్లో భారత జట్టుకు అపారమైన అనుభవం ఉంది" అని ధోని చెప్పాడు.



### ఇంత త్వరగా మైదానంలోకి

## వస్తాననుకోలేదు: తిలక్ వర్మ

నవీ ముంబయి వేదికగా దక్షిణాఫ్రికాతో బుధవారం జరిగిన టీ20 వరల్డ్ కప్ వార్మప్ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా 30 పరుగుల తేడాతో విజయం సాధించిన విషయం తెలిసిందే. శస్త్రచికిత్స తర్వాత తిలక్ వర్మ ఈ మ్యాచ్ ద్వారానే మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు! కేవలం 19 బంతుల్లోనే 45 పరుగులు చేశాడు. ఇందులో 3 ఫోర్లు, 3 సిక్స్‌లున్నాయి. టీమ్‌ఇండియాలోకి తన పునరాగమనం గురించి తిలక్ వర్మ మాట్లాడాడు. ఈ వీడియోను బీసీసీఐ తన సైట్‌లో పోస్ట్ చేసింది. 'ఇంత త్వరగా తిరిగి మైదానంలోకి వస్తానని అనుకోలేదు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, బీసీసీఐకి కృతజ్ఞతలు. వరల్డ్‌కప్‌లో ఆడటం నా కల. నేను మైదానంలోకి అడుగు పెట్టినప్పుడు అందరూ నా పేరును నినదిస్తారని అసలు ఊహించుకోలేదు. అది బాగా నచ్చింది, చాలా ఉత్సాహాన్ని ఇచ్చింది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ బ్యాటింగ్‌ను చూసిన తర్వాత దూకుడుగా ఆడాలనుకున్నాను. కేవలం వార్మప్ మ్యాచ్‌కు అంత మంది ప్రేక్షకులు వస్తారని ఊహించలేదు. కానీ ఆ ఉత్సాహం చాలా అద్భుతంగా ఉంది. ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. ఈ రోజు వాతావరణం చాలా బాగుంది. తిలక్, ఇండియన్ టీమ్ వరల్డ్ కప్‌నకు సిద్ధం' అని తిలక్ వర్మ అన్నాడు. తిలక్ వర్మ 15 టీ20ల్లో మూడోస్థానంలో బ్యాటింగ్‌కు దిగి 542 పరుగులు చేశాడు. ఇందులో రెండు సెంచరీలు, మూడు హాఫ్ సెంచరీలున్నాయి. ఆ రెండు శతకాలు కూడా దక్షిణాఫ్రికా గడ్డపై సఫారీల మీదే సాధించాడు.

# హర్షిత్ రాణాకు ఏమైంది?



టీ20 వరల్డ్ కప్ ప్రారంభానికి మరో రెండు రోజులు మాత్రమే సమయం మిగిలిఉంది. ఈ నేపథ్యంలో హర్షిత్ రాణాకు గాయం కావడం టీమ్‌ఇండియాను కలవరపాటుకు గురిచేస్తోంది. బుధవారం నవీముంబయి వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన వార్మప్ మ్యాచ్‌లో హర్షిత్ రాణా కాస్త ఇబ్బందిపడుతూ కనిపించాడు. కేవలం ఒక్క ఓవర్ మాత్రమే బౌలింగ్ వేసి, 16 పరుగులు ఇచ్చాడు. అనంతరం మైదానాన్ని వీడాడు. తాను బౌలింగ్ వేసే సమయంలో హర్షిత్.. రెండుసార్లు రన్‌అప్‌ను ఆపేశాడు. ఫీల్డ్‌ను వదిలేటప్పుడు కూడా తన మోకాలును పట్టుకొని ఇబ్బందిగా నడుస్తూ కనిపించాడు. శస్త్రచికిత్స తర్వాత తిలక్ వర్మ, గాయం అనంతరం అక్షర్ పటేల్ ఇప్పుడే జట్టులోకి వచ్చారు. ఇలాంటి పరిస్థితుల్లో హర్షిత్ రాణా ఫీల్డ్‌లో ఇబ్బంది పడటం టీమ్‌ఇండియా అభిమానులను కలవరపాటుకు గురి చేస్తోంది. అయితే అతడి గాయంపై బీసీసీఐ ఇప్పటివరకు అప్‌డేట్ ఇవ్వలేదు.




## ఉద్యోగులకు కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్

### 100శాతం బోనస్

ప్రముఖ ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తమ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025 సంవత్సరానికి గానూ 100శాతం బోనస్ ప్రకటించింది. రెండేళ్లకు ముందే కంపెనీ తన లక్ష్యాలను చేరినందుకు గానూ ఈ బోనస్ చెల్లింపులు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవికుమార్ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు. "ఉద్యోగుల క్రమశిక్షణ, పనితీరు, కాగ్నిజెంట్‌పై మన క్లయింట్ల నిబద్ధతకు 2025లో కంపెనీ సాధించిన ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఉద్యోగుల కృషికి గుర్తింపుగా.. 100శాతం బోనస్ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తాం" అని రవికుమార్ తన సందేశంలో తెలిపారు. ఆదాయ వృద్ధి, లాభాలు వంటి అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన అగ్ర శ్రేణి సంస్థల జాబితాలో కాగ్నిజెంట్ చేరింది. 'విన్నర్స్ సర్కిల్'గా అభివర్ణించే ఈ జాబితాలో 2027 నాటికి చేరాలని కాగ్నిజెంట్ లక్ష్యంగా పెట్టుకోగా.. 2025లోనే కంపెనీ దాన్ని సాధించగలిగింది. 2025 మొత్తానికి కాగ్నిజెంట్ ఆదాయం 7% పెరిగి 21.10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.90 లక్షల కోట్ల)కు చేరింది. జనవరి-డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా ఈ కంపెనీ పరిగణిస్తుంటుంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 3.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెజార్టీ ఉద్యోగులు భారత్‌లోనే పని చేస్తున్నారు.



### ఎఫ్‌అండ్‌ఓ సట్టా మార్కెట్ లాంటిది..

## అందుకే ట్యాక్స్ పెంపు

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ ట్రాన్సాక్షన్ ట్యాక్స్ పెంచుతూ ఇటీవల కేంద్రం బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీంతో ఆ రోజు స్టాక్‌మార్కెట్ తీవ్ర అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంది. మార్కెట్ ఒడుదొడుకులు ఎదుర్కొంటున్న వేళ ఎస్‌టీటీ పెంచడం మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీసింది. అయితే, ఈ పెంపు నిర్ణయాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్థించుకున్నారు. ఎఫ్‌అండ్‌ఓ ట్రేడింగ్ అనేది సట్టా మార్కెట్ లాంటిదని, అందుకే ఎస్‌టీటీ పెంచాల్సి వచ్చిందన్నారు. ఈ మేరకు 'ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడారు. "ఎఫ్‌అండ్‌ఓ ట్రేడింగ్ అనేది సట్టా మార్కెట్ (అధిక రిస్క్‌తో కూడిన ట్రేడింగ్. ఓ విధంగా జూదం) లాటింది. ఇక్కడ చాలామంది నష్టపోతున్నారు. ఈ స్పెక్యులేటివ్ ట్రేడింగ్‌లో పాల్గొని 90 శాతం మంది వరకు చేతులు కాల్చుకున్నారు. అందుకే ఎస్‌టీటీ పెంచాల్సి వచ్చింది. అందుకే ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్‌కు సంబంధించి మాత్రమే ఎస్‌టీటీ పెంచాం. మిగిలిన వాటి జోలికి వెళ్లలేదు" అని నిర్మలా సీతారామన్ అన్నారు. ఈక్విటీలపై వచ్చే ఆదాయంపై క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్ పెంచే ఉద్దేశమేదీ లేదని ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్ స్పష్టంచేశారు. నిజాయతీగా పెట్టుబడులు పెట్టి లాభాలు ఆర్జించేవారిని నిరాశపరిచే ఉద్దేశమేదీ లేదన్నారు. ఈక్విటీలపై పన్ను విధించే ఆలోచన ఏదీ లేదని పునరుద్ఘాటించారు. చాలామంది ప్రజలు బ్యాంకులు, పోస్టాఫీసుల్లోని తమ సేవింగ్స్‌ను స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులుగా పెట్టడం శుభపరిణామమని పేర్కొన్నారు. రూపాయి విలువను మార్కెట్ శక్తులే నిర్ణయిస్తాయని, భారీ హెచ్చుతగ్గులు ఉంటేనే ఆర్‌బీఐ జోక్యం చేసుకుంటుందని నిర్మలా సీతారామన్ అన్నారు.

Printed, published and owned by **VELLENKI JAYAPAL REDDY**, printed at **M/s KAKATIYA PRINTERS**, H-No: 24-91/72/1, Block No. 29, Plot Nos 72, 73 and 74, Lakshminarayana Nagar IDA Uppal, Uppal Mandal, Medchal-Malkajgiri Dist, Telangana-39, Published at H-No: 3-125/92/86, Anaghapuri Colony, Boduppal, Medipally Mandal, Medchal-Malkajgiri Dist, Telangana- 92, Editor: **VELLENKI JAYAPAL REDDY**, Cell No: **9346984911, 9133445456**, RNI NO: TELTEL/2023/84471, website: www.nedudailynews.com, e-mail: vellenkijayapalreddy@gmail.com